తెలుగు రాష్ట్రాల ప్రాణనాడి శ్రీశైలం డ్యాం మరమ్మతులకు మోక్షం లభించనుంది. ప్రాజెక్టు దుస్థితిపై సీరియస్ కావడమే కాకుండా, మరమ్మతులకు అవసరమైన నిధులు అంచనాలు తక్షణమే తయారు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. 2009లో డ్యాంకు పోటెత్తిన వరదలకు ప్రాజెక్టు భారీగా దెబ్బతింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిపుణుల కమిటీలు మరమ్మతులు, ప్రమాదకరంగా మారిన ప్లంజ్ పూల్‌పై అధ్యయనం కోసం పలు సూచనలు చేస్తూ నివేదికలు ఇచ్చాయి. ఐదేళ్లలో ప్రాజెక్టు ఇంజనీర్లు దాదాపు 13 సార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గత వైసీపీ హయాంలో నిర్లక్ష్యం శ్రీశైలం డ్యాంకు శాపంగా మారింది. తాజాగా డ్యాంను పరిశీలించిన జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) చైర్మన్ అనిల్ జైన్ డ్యాంను పరిశీలించారు. భద్రత లోపాలపై ప్రభుత్వానికి లేఖ రాశారు. 'ఆర్థిక శాఖతోనే అసలు పేచీ' శీర్షికన ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. సీఎం చంద్రబాబు స్పందించారు. ఎట్టకేలకు మరమ్మతులకు నిధులు వచ్చే అవకాశం ఉందని రైతులు, ఇంజనీర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



మోక్షం లభించేనా..?

- 2009 వరదలకు భారీగా దెబ్బతిన్న శ్రీశైలం డ్యాం
- ప్రాజెక్టు భద్రతపై నివేదికలు
- ఐదేళ్లలో 13 సార్లు ప్రతిపాదనలు
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యం
- తక్షణ మరమ్మతులకు రూ.34 కోట్లు అవసరం
- సీఎం చంద్రబాబు నాయుడు దృష్టి సారించడంతో ఆశలు



కర్నూలు, మే 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం.. బహుళార్థక సాధక ప్రాజెక్టు. తెలుగు రాష్ట్రాలకు జీవనాడి. ముఖ్యంగా నిత్యం కరువుతో తల్లడిల్లే రాయలసీమ పల్లెసీమలకు ప్రాణదాయిని ఈ ప్రాజెక్టు. శ్రీశైలం దేవస్థానం పాతాళగంగ వద్ద కృష్ణా నదిపై 'శ్రీశైలం ప్రాజెక్టు' నిర్మాణానికి 1963 జూలై 24న అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ పునాది రాయి వేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి 20 ఏళ్ల పట్టింది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 308.04 టీఎంసీలు. వరద ప్రవాహ సామర్థ్యం (ఫ్లడ్ వాటర్ డిశ్చార్జ్ కెపాసిటీ) 13.20 లక్షల క్యూసెక్కులు. డ్యాం ఏటేటా పూడిక చేరడంతో.. 2011లో వరద లెక్కలు పరిశీలించి గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలుగా నిర్ధారించారు. అంటే 92.24 టీఎంసీలు పూడిక చేరింది. 12 రేడియల్ క్రస్ట్ గేట్లు స్పిల్‌వే నుంచి వరద జలాలు కిందకు పడి మళ్లీ పైకెగిరి నదిలో పడే ప్లంజ్‌పూల్ ప్రాంతంలో ఏర్పడిన భారీ గుంత డ్యాం పునాదులపై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. 2009 అక్టోబరులో 25.5 లక్షల క్యూసెక్కుల వరద చేరడంతో ప్రాజెక్టు కూడా దెబ్బతింది. 2014 సెప్టెంబరు 23న ఢిల్లీలో కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ శ్రీశైలం సహా వివిధ ప్రధాన ప్రాజెక్టుల భద్రత, నిర్వహణ లోపాలపై సమీక్షించింది. ఆ సమయంలో శ్రీశైలం డ్యాం భద్రతపై నిపుణులు అనుమానాలు వ్యక్తం చేశారు.

డ్యాంను పరిశీలించిన నిపుణుల కమిటీలు

2014 సెప్టెంబరు 23 తర్వాత పలు నిపుణుల కమిటీలు శ్రీశైలం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రతాలోపాలు, 2009 వరదలకు దెబ్బతిన్న డ్యాం మరమ్మతులపై పలు సూచనలతో నివేదికలు ఇచ్చారు. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆదేశాల మేరకు 2014 అక్టోబరులో అప్పటి ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు చైర్మన్, కన్వీనర్ మెంబరు కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ విశ్వేశ్వరరావు, సీడబ్ల్యూసీ హైడ్రాలజీ విభాగం డైరెక్టర్ భూపాల్‌సింగ్, ప్రాజెక్టు డిజైన్ డైరెక్టర్ ఎస్‌కే సిబాల్, ఫౌండేషన్ ఇంజినీరింగ్ డైరెక్టర్ వీఆర్‌కే పిల్లై, సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సీఈ గిరిధర్‌రెడ్డి, రిటైర్డ్ సీఈ కేవీ సుబ్బారావు, తెలంగాణ క్వాలిటీ కంట్రోల్ సీఈ ఎం.కృష్ణారావు సభ్యుల కమిటీ 2014 అక్టోబర్ 28న ప్రాజెక్టును తొలిసారిగా పరిశీలించారు. 2017 జూలై 13న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ డాక్టర్ వైకే మూర్తి నేతృత్వంలోని నిపుణుల కమిటీ, 2018 జూన్ 11న జలవనరుల శాఖ రిటైర్డ్ ఈఎన్‌సీ పి.రామరాజు, రిటైర్డ్ సీఈ కె.సత్యనారాయణ, రిటైర్డ్ ఈఈ కె.కృష్ణ కమిటీ ఈ ప్రాజెక్టును పరిశీలించి డ్యాం భద్రత, ప్లంజ్‌పూల్ మరమ్మతులకు పలు సూచనలు చేస్తూ నివేదికలు ఇచ్చాయి.

మిగతా 7వ పేజీలో



శ్రీశైలం డ్యాంను పరిశీలిస్తున్న ఎన్‌డీఎస్ఏ బృందం

ఇంటర్ పరీక్షల్లో 365 మంది గైర్హాజర్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలో మంగళవారం 365 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలో 9,561 మంది విద్యార్థులకు గానూ 9,242 మంది హాజరు కాగా 319 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 810 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 764 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 365 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో గురువయ్య శెట్టి తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదు. పరీక్ష కేంద్రాలను కన్వీనర్, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్య శెట్టి, డీవీఈవో సురేష్‌బాబు, జిల్లా డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు పర్యవేక్షించారు.

బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

- ఎన్ఎంయూఏ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి

కర్నూలు రూరల్ మే13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని ఎన్ఎంయూఏ జోనల్‌కార్యదర్శి చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. ఆయూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు జిల్లా ప్రజా రవాణా శాఖ(ఆర్ఎం) కార్యాలయాన్ని నాయకులు ముట్టడించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి నక్క రమేష్‌నాయుడు, సి.మద్దిలేటి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా చెన్నారెడ్డి, పీఎండీ ఇస్మాయిల్ పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులను ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేసి నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా చైర్మెన్ గౌస్, వర్కింగ్ ప్రసిడెంట్ పీపీ వళి, డిపో అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీ కార్యదర్శులు, సీసీఎస్ డెలిగేట్స్, మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.



కర్నూలు ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయాన్ని ముట్టడించిన ఎన్ఎంయూఏ నాయకులు

సీబీఎస్ఈ ఫలితాల్లో బనవాసి విద్యార్థుల సత్తా

వందశాతం ఉత్తీర్ణత

ఎమ్మిగనూరు రూరల్, మే13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయలోని విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ విద్యాలయంలో 10వ తరగతిలో 82 మంది విద్యార్థులకు గాను 82 మంది ఉత్తీర్ణతను సాధించారన్నారు. అలాగే 12వ తరగతిలో 36 మంది విద్యార్థులకు గాను 36 మంది విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించినట్లు తెలిపారు. 10వ తరగతిలో రవిత్రయని (488/500) 97.6 శాతం మార్కులు సాధించి విద్యాలయం టాపర్‌గా నిలిచిందన్నారు. 12వ తరగతిలో దీప్తి ప్రియ(462/500) 93.33 శాతం మార్కులు సాధించి విద్యాలయం టాపర్‌గా నిలిచిందన్నారు. 10వ తరగతిలో ఐదు మంది విద్యార్థులు సోషల్, సైన్స్ సబ్జెక్టుల్లో రవిత్రయని సాయి, శ్రీవర్షిణి, నక్షత్ర, ఈశ్వర్, దొరబాబులు 100/100 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను నవోదయ ప్రిన్సిపల్ పద్మావతి, సిబ్బంది అభినందించారు.



దీప్తి ప్రియ (462/500)



రవిత్రయని (488/500)

దేశ రక్షణ నిధికి శ్రీమఠం రూ.25 లక్షలు విరాళం

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ప్రకటన

మంత్రాలయం, మే 13 (ఆంధ్రజ్యోతి): భారత వీర జవాన్లు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటం చేస్తున్న దేశ రక్షణ నిధికి రూ.25లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇండో-పాక్ యుద్ధ వాతావరణంలో జవాన్లు వీర మరణం పొందారని గుర్తుచేశారు. పహల్గాం ఉగ్రదాడిలో హిందూ మతానికి చెందిన వారిని అడిగి మరీ దుర్మార్గంగా హత్య చేయడం బాధాకరమన్నారు. పహల్గాం దాడిలో మృతి చెందిన కర్ణాటక వాసులకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఇచ్చినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం దేశ సైన్య త్రిదళాలపతులు వీరోచిత పోరాటం చేసి పాకిస్థాన్‌ను కోలుకోలేనంత దెబ్బతీశారని అన్నారు. దేశ రక్షణ నిధికి రూ.25 లక్షలు అందజేస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు. సమావేశంలో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్ జోషీ, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, ఐవీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, జేపీ స్వామి, ఏఈ బద్రినాథ్, రవికులకర్ణి, వ్యాసరాజాచార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

భూసేకరణ కేసులను పరిష్కరించండి

కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ కేసులను త్వరిత గతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో భూసేకరణ కేసుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్లకు సంబంధించి మండలాల వారీగా భూసేకరణ కేసుల గురించి సమీక్షించారు. ఏమండలంలో భూసేకరణ సమస్యలు, వాటికి చెల్లించాల్సిన డబ్బు, తదితర సమస్యలపై ఆరాతీశారు. భూసేకరణకు సంబంధించి కోర్టు కేసులపై వెంటనే స్పందించాలని అధికారులను సూచించారు. జిల్లాస్థాయిలో పూర్తి నివేదికను తయారు చేయాలని డీఆర్వోను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆరీవోలు సందీప్‌కుమార్, భరత్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అనురాధ, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హత్యకేసులో గుంతకల్లు ఎమ్మెల్యే సోదరుడు అరెస్ట్

- కాంగ్రెస్ నేత హత్య కేసులో కీలక మలుపు
- త్వరలో మరి కొందరి అరెస్ట్
- కర్నూలు జిల్లా ఎస్పీ హుసేన్ పీరా

7



దేశ సైనికుల త్యాగాలు చిరస్మరణీయం

వివరాలు 6లో

పర్యాటకం




పర్యాటకహబ్‌గా బనగానపల్లె

నంద్యాల జిల్లాలోని బనగానపల్లె నియోజకవర్గ పరిధిలో ఉన్న అనేక ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాంతాలను కలిపి పర్యాటక హబ్‌గా మార్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. మండలంలోని యాగంటి క్షేత్రానికి పర్యాటక ప్రాధాన్యత ఉంది. వివిధ జిల్లాల నుంచి భక్తులు నిత్యం వందలాదిగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అట్లాగే మండలంలోని చౌడేశ్వరీమాత ఆలయంలో జరిగే జ్యోతి ఉత్సవాలకు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తుంటారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెలుం గుహలు, అవుకు రిజర్వాయర్, అక్కడి బోటింగ్ చాలా పర్యాటకులను ఆకట్టుకుంటాయి. యాగంటి సమీపంలోని పాతపాడు గ్రామం వద్ద ఉన్న నవాబుల పాతపాడు బంగ్లాకు చారిత్రక ప్రాధాన్యత ఉంది. నియోజకవర్గంలోని ఇలాంటి ప్రాంతాలన్నిటినీ కలిపి పర్యాటక హబ్ ఏర్పాటు చేసే ప్రయత్నంలో రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

- నియోజకవర్గంలో అనేక ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె నియోకవర్గంలో అనేక పుణ్య క్షేత్రాలు ఉన్నాయి. చారిత్రక, పర్యాటక స్థావరాలు ఉన్నాయి. ఈ అనుకూలత ఆధారంగా పర్యాటక హబ్ ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. యాగంటి క్షేత్రం కర్నూలు నుంచి 87 కిలోమీటర్ల దూరంలో ఉంది. బనగానపల్లె నుంచి యాగంటి వరకు డబుల్ రోడ్డు సౌకర్యం ఉంది. గతంలో పాతపాడు నుంచి యాగంటికి సింగిల్ రోడ్డు ఉండేది. ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయించి డబుల్ రోడ్డుగా మార్చారు. దీంతో భక్తులు ఇబ్బందులు పడకుండా యాగంటికి చేరుకుంటున్నారు. నంద్యాలనుంచి 55 కిలోమీటర్లు, బనగానపల్లె నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉండే యాగంటికి ఆటోల్లో వెళ్లవచ్చు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా ఉంది.



యాగంటి ఆలయ రాజగోపురం

యాగంటిలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో గదులు ఉన్నాయి. అలాగే ప్రైవేటుగా నిర్వహించే బ్రాహ్మణి రెసిడెన్సీలో ఏసీ గదుల సౌకర్యం ఉంది. రూ.కోటి వ్యయంతో కొండలను తొలిచి యాత్రికులు కూర్చోవడానికి, సేదతీరేందుకు దేవదాయశాఖ ప్రణాళికలు రూపొందించింది. నిత్యం వేలాది మంది యాత్రికులు వస్తుంటారు. భక్తులు కూర్చోవడానికి హాల్ సౌకర్యం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. అలాగే వృద్ధులు ఆలయంలోకి వెళ్లడానికి లిఫ్ట్ సౌకర్యం కల్పించడానికి ప్రతిపాదనలు పంపారు.

నందవరం చౌడేశ్వరీమాత ఆలయం

బనగానపల్లె మండలంలోని చౌడేశ్వరీమాత ఆలయం ప్రముఖ శక్తిక్షేత్ర. కాశీవిశాలాక్షిగా అమ్మవారిని భక్తులు కొలుస్తారు. రాష్ట్రం నుంచేగాక తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు వస్తుంటారు. ఇటీవల నిర్వహించిన జ్యోతి ఉత్సవాల్లో లక్షకు పైగా భక్తులు వచ్చారు. బనగానపల్లె నుంచి పది కిలోమీటర్లు, నంద్యాలనుంచి 32 కిలోమీటర్లు, కర్నూలు నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంటుంది. ఈ ఆలయం సమీపంలో అత్యంత పురాతన త్రిలింగేశ్వరస్వామి ఆలయం ఉంది.



నందవరం శ్రీచౌడేశ్వరీమాత ఆలయ రాజగోపురం

బ్రహ్మంగారి మఠం: బనగానపల్లె పట్టణంలో వీరబ్రహ్మేంద్రస్వామి నడయాడిన చింతమానుమఠం, రవ్వలకొండ, అక్కడ ఆయన శివలింగం ప్రతిష్ఠించిన నేలమఠం వంటి ప్రాంతాలు ఉన్నాయి. పక్క రాష్ట్రాల నుంచి పర్యాటకులు ఇక్కడికి విరివిగా వస్తుంటారు.



పాతపాడు బంగ్లా

నవాబు బంగ్లా : బనగానపల్లె పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో పాతపాడు గ్రామం వద్ద నవాబు బంగ్లా ఉంది. వంద సంవత్సరాల క్రితం బనగానపల్లె నవాబుల కాలంలో నిర్మించబడింది. ఇప్పటికీ ఈ కట్టడం చెక్కుచెదరలేదు. ఈ బంగ్లా వద్దనే అరుంధతి సినిమాను తీశారు. అందుకే దీన్ని అరుంధతి బంగ్లా అని అంటారు. ఇక్కడ అనేక సినిమాల షూటింగ్‌లు, సీరియల్స్‌ను తీశారు. యాగంటికి వచ్చే యాత్రికులు తప్పనిసరిగా నవాబు బంగ్లాను సందర్శిస్తుంటారు.

బెలుం గుహలు

నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలంలో విశ్వవిఖ్యాతి గాంచిన బెలుం గుహలు ఉన్నాయి. గుహల అభివృద్ధికి టూరిజం శాఖ ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం గుహల్లో 27 బ్లోయర్లను ఏర్పాటు చేశారు. 2000లో బెలుం గుహలను అభివృద్ధికి చేసి ప్రారంభించారు. రోజు వివిధ రాష్ట్రాల నుంచి 2వేల మంది యాత్రికులు వీటిని సందర్శిస్తుంటారు. సెలవు రోజుల్లో అధికంగా వస్తుంటారు. గుహల్లో ప్రకృతి సిద్ధమైన శిలాజాలను చూడడానికి వస్తుంటారు. విదేశీయులు కూడా గుహలను సందర్శిస్తుంటారు. గుహల్లో ధ్యానమందిరం, ఊడలమర్రి, పాతాళగంగ, మాయమందిరం, కోటిలింగాలు, యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తుంటాయి. ఇక్కడ బుద్ధ విగ్రహం ఉంది. అయితే బెలుం గుహల్లో నాలుగు డార్మెట్రీ గదులు మాత్రమే ఉన్నాయి. బనగానపల్లె నుంచి 35 కిలోమీటర్లు, కర్నూలుకు 110 కిలోమీటర్ల దూరంలో ఈ గుహలు ఉన్నాయి. బనగానపల్లె నుంచి ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం ఉంది.



బెలుం గుహల్లోకి వెళ్లే దారి



అవుకు రిజర్వాయరు

బనగానపల్లె నియోజకర్గంలో చూడదగ్గది అవుకు రిజర్వాయర్. గతంలో ఇక్కడ బోటింగ్ సౌకర్యం ఉండేది. బోట్ ప్రమాదం జరగడంతో ఈ సౌకర్యం నిలిపివేశారు. అయినా నిత్యం అవుకు రిజర్వాయర్‌ను సందర్శించడానికి అధిక సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. బనగానపల్లె నుంచి 20 కిలోమీటర్లు, కర్నూలు నుంచి 95 కిలోమీటర్లు, నంద్యాల నుంచి 61 కిలోమీటర్ల దూరంలో ఈ రిజర్వాయర్ ఉంటుంది.

బనగానపల్లెను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం



బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రముఖ ఆలయాలు, బెలుంగుహలు, అవుకు రిజర్వాయర్ తదితర పర్యాటక ప్రాంతాలు ఉండటంతో ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. అట్లాగే ఆలయాలు, బెలుం గుహల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. యాగంటిలో సెంట్రల్ ఏసీ, పార్కింగ్ సౌకర్యం ఇతరత్రా ఏర్పాట్లు చేస్తాం.

– బీసీ జనార్దన్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి



బెలుంగుహల అందాలు

ఉర్దూ వర్సిటీ డిగ్రీ ఫలితాలు విడుదల



పరీక్షల ఫలితాలను విడుదల చేసిన ఉపకులపతి

కర్నూలు అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఏప్రిల్‌లో జరిగిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ పీఎస్ షావలిఖాన్ విడుదల చేశారు. మంగళవారం తన చాంబర్లో రిజిస్ట్రార్ లోక్‌నాథ్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. డిగ్రీ ఎకనామిక్స్, బీకాం, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ జూవాలజీ, 6వ సెమిస్టర్ బీఏ(హెచ్‌ఈపీ)బీకామ్ కంప్యూటర్స్ అప్లికేషన్స్, 8వ సెమిస్టర్ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ బాటనీ, జువాలజీ, పదో సెమిస్టర్ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ బాటనీ, జూవాలజీ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.మహబూబ్ బాషా, పరీక్షల విభాగం కంట్రోలర్ ఎం.నబియా సుల్తానా, వెంకటప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూర్య ప్రతాపం

- కర్నూలు జిల్లా నందవరంలో 43.22 డిగ్రీలు
- నంద్యాల జిల్లా పాణ్యంలో 42.00 డిగ్రీల ఉష్ణోగ్రత
- భిన్న వాతావరణ పరిస్థితులతో అల్లాడుతున్న ప్రజలు



నంద్యాల ఎడ్యుకేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. రోజురోజుకు ఎండలు ముదురుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున వర్షం, ఉదయం 11గంటల నుంచి ఎండ తీవ్రత ప్రభావం నెలకొంది. భిన్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం పూట కాస్త చల్లగాలి వీచినప్పటికీ 12గంటల తర్వాత వేడిగాలుల ప్రభావంతో ఇళ్లకే పరిమితమవుతున్నారు. కర్నూలు జిల్లా నందవరంలో 43.22 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కౌతాళం 40.09, వెల్దుర్తి 39.05, కల్లూరు 38.9, కర్నూలు నగరం 38.75, కోడుమూరు 38.09, సి.బెళగల్ 37.90, క్రిష్ణగిరి 37.90 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణసంస్థ వెల్లడించింది.

- నంద్యాల జిల్లాలో పాణ్యంలో 42.00, చాగలమర్రి 41.93, రుద్రవరం 41.02, ఆళ్లగడ్డ 40.44, దొర్నిపాడు 40.42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

38.0 ఎం.ఎ వర్షపాతం

కర్నూలు జిల్లా కోడుమూరు మండలం లద్దగిరి 38.0ఎంఎం వర్షపాతం నమోదైంది. కల్లూరు మండలం లక్ష్మీపురం 32.0, వెల్దుర్తి నరసాపురం 29.0, ఎమ్మిగనూరు మండలం సొళ్లకుడ్లూరు 21.0, కర్నూలు నగరం 17.75, కర్నూలు మండలం దిన్నెదేవరపాడు 13.5, ఆస్పరి మండలం చిన్న హోతూరు 10.5, ఎమ్మిగనూరు పట్టణం 10.5, గూడూరు మండలం కె.నాగలాపురం 6.5ఎంఎం వర్షపాతం నమోదైంది.

నంద్యాల జిల్లాలో..

కొలిమిగుండ్లలో 37.5ఎంఎం, అవుకు మండలం కొండమాయపల్లెలో 27.5, జూపాడుబంగ్లా 27.5, రామాపురంలో 17.0, నందికొట్కూరు మండలం శాతనకోటలో 12.5, నందికొట్కూరులో 11,5, కొణిదెలలో 10.5, మహానందిలో 9.4 వర్షపాతం నమోదైనట్లు వాతావరణసంస్థ వెల్లడించింది.



దేశభక్తిపై నృత్య రూపకం ప్రదర్శిస్తున్న కళాకారిణులు

దేశ సైనికుల త్యాగాలు చిరస్మరణీయం

జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్

కర్నూలు కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం సైనికులు చేస్తున్న త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న జై జవాన్ కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమానికి నాలుగోరోజు ఏర్పాటు చేసిన దేశభక్తి ప్రబోధించే జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాల ప్రదర్శనలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత భరతమాత చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కళాకారులు, నిర్వాహకులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ శామ్యూల్ పాల్ మాట్లాడుతూ దేశ రక్షణలో రాయలసీమ ప్రాంత వాసి మురళీనాయక్ వీరమరణం పొందడం ఆయన ధైర్య సాహసాలకు ప్రతీక అన్నారు. అలాంటి వీర జవాన్‌ను దేశానికి అందించిన ఆయన తల్లిదండ్రుల సేవలను ఆయన కొనియాడారు. ఈనెల 16న సాయంత్రం ఐదు గంటలకు కలెక్టరేట్ కార్యాలయం నుంచి టీజీవీ కళాక్షేత్రం వరకు భారత సైనికులకు సంఘీభావంగా భారీ ర్యాలీ ఉంటుందని, ఇందులో జిల్లాలోని వివిధ ప్రాంతాల ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ దేశ సైనికులకు మద్దతుగా ఈనెల 16న సాయంత్రం చేపట్టిన ర్యాలీకి జిల్లాలోని కళాకారులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన, మహిళా సంఘాలవారు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం ప్రతినిధులు టి. రాజారత్నం, సంగా ఆంజనేయులు, మహమ్మద్ మియా, యాగంటీశ్వరప్ప, ఇనాయతుల్లా, శ్రీనివాసరెడ్డి, బాలవెంకటేశ్వర్లు, క్రిష్టఫర్, చంద్రకంటి మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు: జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా మంగళవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యులు ఎస్ కరీముల్లా, నాగసాయి ప్రదీప్, మల్లేశ్వరి, రోహిత్, నారాయణ స్వామి శిష్యబృందం ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ నృత్య రూపకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా బుధవారం సాయంత్రం నుంచి దేశభక్తిని చాటిచెప్పే సినీ సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



కళాకారులతో కలిసి 'జై జవాన్' కల్చరల్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ శామ్యూల్ పాల్



టౌన్ మోడల్

ప్రతిభావంతుల వేదిక

- సరస్వతీ నిలయంగా టౌన్ మోడల్ జూనియర్ కళాశాల
- రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ ఫలితాలే
- ఇక్కడ విద్యను అభ్యసించిన ఎంతో మంది ప్రముఖులు
- దేశవిదేశాల్లో ఉన్నత కొలువుల్లో విద్యార్థులు



కర్నూలు ఎడ్యుకేషన్, మే 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు టౌన్ మోడల్ జూనియర్ కళాశాల ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకున్నారు. దేశవిదేశాల్లో ఉన్నత కొలువుల్లో రాణిస్తున్నారు. ఈ సరస్వతీ నిలయంలో చదివిన విద్యార్థులు టీజీ భరత్ రాష్ట్ర మంత్రిగాను, డా.సంజీవ్‌కుమార్, బస్తిపాటి. నాగరాజు ఎంపీలు గానూ, ఇంతియాజ్(ఐఏఎస్), వెంకటరామిరెడ్డి ఐపీఎస్‌లుగాను, డా. చంద్రశేఖర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతిగాను, డా.భాను మతి, డా.శ్రీనివాసులు వివి సీతారామయ్య, ప్రముఖ పారిశ్రామిక వేత్తగా రవీంద్రరెడ్డితో పాటు పలువురు ఈచెట్టు నీడన విద్యను అభ్యసించిన వారే. సరస్వతీ నిలయంగా కర్నూలు టౌన్ మోడల్ జూనియర్ కళాశాల బాసిల్లుతోంది. కర్నూలు టౌన్ మోడల్ జూనియర్ కళాశాలకు ఒక ప్రత్యేకత నెలకొంది. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాల సాధిస్తున్నారు.

1971లో కళాశాల ఏర్పాటు

కర్నూలులో 1971 సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థాపించారు. ఈకళాశాలల్లో 1100 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. తెలుగు, ఇంగ్లీషు మీడియంల్లో బోధన కొనసాగుతోంది. జనరల్‌తో పాటు, ఒకేషనల్ కోర్సులు ఉన్నాయి. ఈ కళాశాలలో సీటు కోసం రాజకీయ ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు కావల్సిందే. ఈ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులు పోటీపడుతుంటారు.

రాష్ట్రస్థాయిలో అగ్రస్థానం..

కల్లూరుకు చెందిన ఆటో డ్రైవర్ కృష్ణ రెండో కుమార్తె పేరు బండ పావని. కర్నూలు ప్రభుత్వ టౌన్‌మోడల్ జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్ ఎంపీసీలో 986 సాధించింది. రాష్ట్రస్థాయిలో అగ్ర స్థానంలో నిలిచింది. అలాగే పి.లలితారాణి 977 మార్కులు తెచ్చుకొని కళాశాల రెండో స్థానంలో నిలిచారు. బైపీసీ విభాగంలో బి.నందిని 980 మార్కులు, రేణు విజయ 978మార్కులు సాధించి కళాశాల,రాష్ట్రస్థాయి టాపర్లుగాను నిలిచారు. 986 మార్కులు సాధించిన పావని సన్‌షైన్ అవార్డుకు ఎంపికైంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ప్రతి సంవత్సరం కూడా ఈ కళాశాల నుంచి అత్యధిక మార్కులు సాధిస్తూనే ఉన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



కళాశాలల ప్రారంభం నుంచే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతాం. ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ ఏర్పాటుచేస్తాం. రివిజన్ టెస్టులు పెట్టుతాం. ప్రతి అధ్యాపకుడికి 50మంది విద్యార్థులను దత్తత ఇచ్చి, మానిటరింగ్ చేస్తాం. చదువులో వెనకబడిన విద్యార్థులను రిమిడియల్ క్లాస్‌లను చెప్పిస్తాం. తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రొగ్రెస్‌ను తెలియజేసి వారిని అప్రమత్తం చేస్తాం. పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత రావడానికి అధ్యాపకుల సమష్టి కృషి ఉంది.

– సుంకన్న, ప్రిన్సిపాల్, టౌన్ మోడల్ జూనియర్ కాలేజీ

మోక్షం లభించేనా..?

(5వ పేజీ తరువాయి)



2020 ఫిబ్రవరి 25న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్, డ్యాం భద్రతా నిపుణులు ఏబీ పాండ్యా చైర్మన్‌గా కేంద్ర నిపుణుల కమిటీ డ్యాంను పరిశీలించడమే కాకుండా.. వివిధ నిపుణుల కమిటీలు ఇచ్చిన అధ్యయన నివేదికలు స్టడీ చేసి డ్యాం భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తూ 2021లో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)కు నివేదిక ఇచ్చారు. ఆ తరువాత నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ వివేక్ త్రిపాఠి ఆధ్వర్యంలో నిపుణుల బృందం పరిశీలించింది.

వైసీపీ హయాంలో అంతులేని నిర్లక్ష్యం

ప్రాజెక్టు ఆనకట్ట స్పిల్‌వే గేట్ల నుంచి అతివేగంగా కింద పడే వరద మళ్లీ ఎగిరి పడే ప్రాంతం (ప్లంజ్‌పూల్)లో భారీ గుంత ఏర్పడింది. దీని లోతు 45 మీటర్లు, వెడల్పు 270 మీటర్లు, పొడవు 400 మీటర్లు ఉంటుందని అంచనా వేశారు. డ్యాం డౌన్ స్ట్రీమ్‌లో ఆప్రాన్‌కు వెళ్లాలంటే 3-4 కిలోమీటర్లు అప్రోచ్ రోడ్డు కీలకం. 2009 వరదలకు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయి ఆనవాళ్లే లేకుండా పోయాయి. రిటైనింగ్ వాల్ 2.50 కిలోమీటర్లు ఉంటే.. 600 మీటర్లు పూర్తిగా కొట్టుకుపోయింది. డ్యాం ఇంటర్మీడియట్ లెవల్ గ్యాలరీలు లీకేజీలు, ముఖ్యంగా స్టీల్ సిలెండర్లకు రంధ్రాలకు తక్షణ మరమ్మతులు చేయాల్సి ఉంది. ప్రమాకరంగా మారిన ప్లంజ్‌పూల్ గుంత పూడ్చివేతకు ఎలాంటి ఆధునిక పద్ధతులు చేపట్టాలో ఆధ్యాయనం కోసం పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్)ను గుర్తించారు. ఈ సంస్థకు అడ్వాన్స్‌గా తక్షణం రూ.50 లక్షలు చెల్లించాలి. ఆయా పనుల కోసం డివిడెండ్ రీన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (డ్రిప్-2) గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.135 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. కేంద్రాన్ని ఒప్పించి నిధులు తీసుకురావడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందింది. తాజాగా ఆ ప్రతిపాదనలు రూ.203 కోట్లకుపైగా చేరాయి. అయితే డ్యాంను పరిశీలించిన ప్రపంచ బ్యాంక్ బృందం అత్యవసరం పనులకు ప్రతిపాదనలు పంపమంటే రూ.108 కోట్లకు పంపారు. ప్రపంచ బ్యాంక్ ఒప్పుకున్నా.. ప్రభుత్వం వద్ద పెండింగులో ఉంది. నాడు వైసీపీ ప్రభుత్వం, తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చాక మొత్తం 13 సార్లు ప్రతిపాదనలు పంపినా స్పందించలేదని తెలుస్తుంది.

తక్షణం రూ.34 కోట్లు కావాలి

డ్యాం డౌన్ స్ట్రీమ్‌లో ఆప్రాన్‌కు వెళ్లాలంటే అప్రోచ్ రోడ్డు, కుడి, ఎడమ గట్లు స్లిప్ కాకుండా మరమ్మతులు.. వంటి వివిధ పనులకు తక్షణం రూ.34 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అలాగే.. ఫ్లంజ్‌పూల్ అధ్యయనం కోసం సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు రూ.50 లక్షలు అడ్వాన్స్ చెల్లించాలని ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ఫలితంగా మరమ్మతులు ప్రశ్నార్థకంగా మారాయి. ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్ లేఖతో రాయడం, ఆ అంశాలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. సీఎం చంద్రబాబు స్పందించడమే కాకుండా మరమ్మతులకు అంచనాలు తయారు చేయ మని ఆదేశాలు జారీ చేయడంతో మరమ్మతులపై ఆశలు చిగురిస్తున్నాయి.

నిధులు రాగానే మరమ్మతులు చేపడుతాం

శ్రీశైలం ప్రాజెక్టు తక్షణ మరమ్మతులకు రూ.34 కోట్లు, ఫ్లంజ్ పూల్ అధ్యయనం కోసం రూ.50లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే మరమ్మతులు చేపడుతాం. అప్రోచ్ రోడ్డు, కుడి, ఎడమ గట్లు స్లోప్స్ మరమ్మతులు తక్షణమే చేపట్టాలి.

- కబీర్‌బాషా, సీఈ, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్, కర్నూలు.

హత్యకేసులో గుంతకల్లు ఎమ్మెల్యే సోదరుడి అరెస్ట్

- కాంగ్రెస్ నేత హత్య కేసులో కీలక మలుపు
- త్వరలో మరికొందరి అరెస్ట్
- కర్నూలు జిల్లా ఏఎస్పీ హుసేన్ పీరా



హత్య కేసులో నారాయణ అరెస్టును చూపుతున్న అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా

ఆలూరు/కర్నూలు, మే 13(ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో అనంతపురం జిల్లా గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు, ఆలూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. స్వగ్రామం చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామంలో ఇంట్లో గుమ్మనూరు నారాయణ ఉన్నారని పక్కా సమాచారంతో ఏఎస్పీ హుసేన్ పీరా, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో భారీఎత్తున పోలీసు బలగాలు గుమ్మనూరు చేరుకొని అరెస్టు చేశారు. నారాయణ మాజీ మంత్రి, గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం సోదరుడు కావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ నేత చిప్పగిరి లక్ష్మీనారాయణ గుంతకల్లులో పనులు ముగించుకొని తన వాహనంలో స్వగ్రామం చిప్పగిరికి బయలుదేరుగా.. గుంతకల్లు శివారులో రైల్వేగేట్ వద్ద పక్కా ప్రణాళికతో టిప్పర్‌తో ఢీకొట్టి, ఆ వెంటనే మారుణా యుధాలతో లక్ష్మీనారాయణను అతిదారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే.

లక్ష్మీనారాయణ 2007 నవంబరు 18న జరిగిన కర్నూలు జిల్లా కీలక టీడీపీ నేత, కేడీసీసీబీ మాజీ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు, ఆయన సతీమణి శకుంతలమ్మ దంపతులను జంట హత్య కేసులో ఏడో నిందితుడుగా ఉన్నారు. ఈ కేసును న్యాయస్థానం కొట్టివేసింది. దీనికి ప్రతికారంగానే నారాయణ హత్య చేయించి ఉంటారనే అనుమానంతో లక్ష్మీనారాయణ కుమారుడు వినోద్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ నేత వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జున, కొండ రామాంజి, అరికేర మల్లేశ్‌లపై చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

గుంతకల్లులో భూ వివాదం..

అయితే గుంతకల్లు పట్టణంలో ఓ భూమి వివాద పంచాయితీలో కాంగ్రెస్ నేత లక్ష్మీనారాయణకు, గుంతకల్లుకు చెందిన గౌసియాబేగం మధ్య విభేదాలు తలెత్తడంతో.. గౌసియా ఈ హత్య చేయించారని పోలీసులు దర్యాప్తులు తేలడంతో గౌసియా, పెద్దన్న, సౌభాగ్య, రాజేశ్‌లతో పాటు మరో ఆరుగురిని పోలీసులు ఈ కేసులో నిందితులుగా చేర్చారు. ఇప్పటికే గౌసియా, సౌభాగ్య, రాజేశ్‌ను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం రిమాండ్‌కు ఆదేశించింది. ఎవరూ ఊహించని విధంగా గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణను పోలీసులు అరెస్టు చేయడం ఆలూరు, గుంతకల్లు నియోజకవర్గాల్లో రాజకీయంగా చర్చగా మారింది. అరెస్టుచేసిన నారాయణను ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు అనంతరం ఆలూరు న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయాధికారి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించారు. దీంతో కర్నూలు జిల్లా జైలుకు తరలించారు. అరెస్ట్‌పై ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డితో కలసి అడిషినల్ ఎస్పీ హుసేన్‌పీరా, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యలు ఆలూరు పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. హత్య కేసు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసినప్పుడు సాంకేతిక ఆధారాలు (టెక్నికల్ ఎవిడెన్స్), సెల్‌ఫోన్ డేటా ఆధారాలను పరిశీలిస్తే.. ఈ కేసులో గుమ్మనూరు నారాయణ పాత్ర కూడా ఉన్నట్లు తేలడంతోనే అరెస్టు చేశామని తెలిపారు. రైల్వే టెండర్లు, కమిషన్ల విషయంలో చిప్పగిరి లక్ష్మీనారాయణ, గుమ్మనూరు నారాయణల మధ్య విభేదాలు ఉన్నాయన్నారు. దీనికి తోడు భూవివాదాల కారణంగా హత్యకు గురైన లక్ష్మీనారాయణ గుంతకల్లుకు చెందిన గౌసియా, పెద్దన్న, రాజేష్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతానని బెదిరించడంతో ఎలాగైనా ఆయనను హత్య చేయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. హత్యకు ఉపయోగించిన టిప్పర్‌ను కొనుగోలు చేసేందుకు రూ.2 లక్షలు ఆర్థిక సాయం గుమ్మనూరు నారాయణ అందించాడని, హత్య జరిగిన తరువాత వారి అవసరాల కోసం మరో రూ.1.50 లక్షలు ఇచ్చినట్లు దర్యప్తులో వెల్లడైందని తెలిపారు. ఇదే విషయాన్ని నిందితుడు గుమ్మనూరు నారాయణ కూడా విచారణలో అంగీకరించడంతో అరెస్టు చేశామన్నారు. అతడి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ కేసులో త్వరలో మరికొందరిని త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు.

అభ్యాస ఫలితాల్లో మార్పే లక్ష్యం

- నూతన విద్యావిధానం జీవో విడుదల
- డ్రాపౌట్స్ నివారించేందుకు కసరత్తు



నంద్యాల ఎడ్యుకేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానంలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల అభ్యాస ఫలితాలను మార్చే లక్ష్యంతో రూపొందించిన సమగ్ర నమూనాను పాఠశాల విద్యాశాఖ మంగళవారం విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ పెరగడం, ఉపాధ్యాయులపై పనిభారం అధికం కావడం, తరగతి గదుల్లో సరైన మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడం తదితర కారణాలతో అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపడం జరిగిందని ప్రభుత్వం గుర్తించింది. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కసరత్తు చేసి రాబోయే విద్యాసంవత్సరంలో ఏర్పాటుచేయనున్న విద్యావ్యవస్థలో మార్పులను ప్రకటించింది, మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 13,192 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి పూనుకుంది. అందులో భాగంగానే మున్సిపల్ పాఠశాలల పర్యవేక్షణ, పరిపాలనా బాధ్యతను విద్యాశాఖకు అప్పగించింది.

పాఠశాలల విధానం ఇదీ

- శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్(పీపీ1, పీపీ2)
అంగన్‌వాడీకేంద్రాలు శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్‌గా మారి యథావిధిగా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తాయి.
- ఫౌండేషన్ స్కూల్(పీపీ1, పీపీ2, క్లాస్1, 2)
సమీప ప్రాథమిక పాఠశాలలకు కిలోమీటర్ దూరానికి పైగా ఉన్న అంగన్‌వాడీలను పాఠశాలలో విలీనం చేస్తారు. పీపీ1, 2 విద్యార్థులకు అంగన్‌వాడీ వర్కర్‌లు, క్లాస్1, 2 తరగతులకు ఎస్జీటీలు బోధిస్తారు.
- బేసిక్ ప్రైమరీ స్కూల్(పీపీ1, పీపీ2, క్లాస్ 1 నుంచి 5వతరగతి వరకు)
1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 59 మంది విద్యార్థుల లోపు ఉంటే ఇద్దరు ఎస్జీటీలతో బోధిస్తారు.
- మోడల్ ప్రైమరీ స్కూల్(పీపీ1, పీపీ2, క్లాస్ 1 నుంచి 5వ తరగతి వరకు)
1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 60 మంది విద్యార్థుల కన్నా ఎక్కువగా ఉంటే నలుగురు ఎస్జీటీలతో బోధిస్తారు.
- ఉన్నత ప్రాథమిక పాఠశాల (పీపీ1, పీపీ2, క్లాస్ 1 నుంచి 8వ తరగతి వరకు)
1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాల లేదా మోడల్ పాఠశాలగా పనిచేస్తుంది. వీరికి ఎస్జీటీల చేత బోధిస్తారు. 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్‌లు బోధిస్తారు.
- హైస్కూల్ (6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు)
ఈ పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతులకు కేవలం స్కూల్ అసిస్టెంట్‌లతోనే బోధించడం జరుగుతుంది.
- హైస్కూల్ (1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు)
ఈ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 5వరకు ఎస్జీటీలు, 6 నుంచి 10 తరగతులకు స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తారు. ప్రధానోపాధ్యాయులు టైంటేబుల్ ను రూపొందిస్తారు.
- హైస్కూల్ ప్లస్ (6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు)
మొత్తం 7 తరగతుల విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తారు.
- హైస్కూల్ ప్లస్(1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు)
1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఎస్జీటీలు, 6 నుంచి 12వరకు స్కూల్‌అసిస్టెంట్లు బోధిస్తారు. ప్రధానోపాధ్యాయులు అన్ని తరగతులకు టైంటేబుల్‌ను రూపొందిస్తారు.

అప్పుల బాధతో కౌలు రైతు బలవన్మరణం

బండిఆత్మకూరు, మే13(ఆంధ్రజ్యోతి): అప్పులు అధికం కావడంతో ఉరేసుకొని ఓ కౌలురైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని భోజనం గ్రామంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన చాకలి రాముడు(65) అనే రైతు తనకున్న ఎకరా పొలంతో పాటు మరో 10ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. వ్యవసాయంలో సుమారు రూ.12లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే స్థోమత లేక సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడి మనవడి పెళ్లి మంగళవారమే ఉండటంతో ఆ ఇంట విషాదం అలుముకుంది.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

ఆదోని రూరల్/ఆస్పరి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆస్పరి మండలంలోని ములుగుందం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గోవిందు(30) పిడుగుపాటుతో మృతిచెందాడు. వివరాల మేరకు.. మృతుడు మరో కాపరి ఆంజనేయతో కలిసి ఆదోని మండలం చిన్నహరివాణం పొలాల్లో గొర్రెలను మేపేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు, పిడుగులతో వర్షం కురిసింది. వీరు ఓ కంప చెట్టు వద్దకు చేరారు. గోవిందు కంపచెట్టుకింద నిలబడగా, ఆంజనేయులు కింద కూర్చున్నాడు. ఇంతలో పిడుగు పడడంతో ఇరువురు కుప్పకూలారు. కొద్దిసేపటికి ఆంజనేయలుకు స్పృహ రావడంతో గోవిందును లేపేందుకు ప్రయత్నించగా లేవలేదు. గోవిందు శరీరంపై గాయమైనట్లు గురించి పక్క పొలాల వారికి సమాచారం అందజేశారు. అప్పటికే గోవిందు మృతిచెందాడని తెలుసుకుని రెవెన్యూ, పోలీ సులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు. భార్య రంగవేణి, కుటుంబ సభ్యులు చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు.



గోవిందు(ఫైల్)

అదుపులో ఎద్దుల దొంగ

పత్తికొండ, మే13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు గ్రామంలో గత నెల 29న చోటుచేసుకున్న ఎద్దుల దొంగతనంలో కర్ణాటక రాష్ట్రం సింధనూరుకు చెందిన హనీఫ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జయన్న తెలిపారు. మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన హరిజన సంజన్నకు చెందిన 4 ఎద్దులను నిందితుడు మరోవ్యక్తితో కలసి ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీలను పరిశీలించగా నిందితులు వాడిన వాహనం , ఎద్దులు తరలిస్తున్న దృశ్యాలు గుర్తించామన్నారు. దొంగలు కర్ణాటక రాష్ట్రం సింధనూరుకు చెందినవారుగా గుర్తించి, వాహనంతోపాటు నిందుతుల్లో ఒకరైన హనీఫ్‌ను మంగళవారం హోసూరు రహదారిలో అరెస్టుచేశామన్నారు. మరో నిందుతుడి ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు. వాహనంతోపాటు దొంగిలించిన ఎద్దులలను అమ్మగా వచ్చిన రూ.2.60లక్షలను రికవరీ చేశామన్నారు.

భార్య హత్య కేసులో అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

బేతంచెర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని గౌరిపేటలో నివాసముంటున్న షేక్ జకియా బేగంను ఈనెల 10వ తేదీన హత్యకు గురైంది. ఆమెను భర్త షేక్ రసూల్ హత్య చేసి పరారయ్యాడు. అతడు బనగానపల్లె రహదారిలోని బీసీ రాజారెడ్డి మినరల్ వాటర్ ప్లాంటు వద్ద ఉన్న మౌలాలిస్వామి దర్గా వద్ద ఉన్నట్లు సమాచారం అందింది. మంగళవారం మధ్యాహ్నం సీఐ, ఎస్ఐ మహేష్‌బాబు సిబ్బందితో కలిసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని డోన్ కోర్టులో హాజరు పరచగా. మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎమ్మిగనూరు రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సోమవారం అర్ధరాత్రి యువకుడు మృతి చెందాడు. ఎమ్మిగనూరు పట్టణంలోని లక్ష్మీపేట వీధికి చెందిన షేక్ అమాన్ అలి(23) తన మిత్రులతో కలిసి కారులో ఆదోని వెళ్లాడు. అయితే ఆదోని నుండి ఎమ్మిగనూరుకు వస్తున్న సమయంలో బోడబండ సమీపానికి రాగానే కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారు డ్రైవింగ్ చేస్తున్న షేక్ అమాన్ అలి అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న మిత్రులకు చిన్నపాటి గాయాలయ్యాయి. అలి మిత్రులు కుటుంబ సభ్యులకు తెలిపారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రమాద స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

అవుకు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టుపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముడావత్ రసూల్‌నాయక్ (61) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. రసూల్‌నాయక్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఉదయం అవుకు టన్నెల్‌లో కూలీ పనులు చేసుకొనేందుకు మోటర్ సైకిల్‌పై వెళుతుండగా మెట్టుపల్లె సమీపంలోకి వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రసూల్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమాస్టరం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవిభాయి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

పత్తికొండ, మే13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరివీదిలో తాళం వేసి ఉన్న ఇంట్లో మంగళవారం దొంగతనం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ముత్యాల లక్ష్మన్న అనే వ్యక్తి బంధువుల ఫంక్షన్ ఉండడంతో ఇంటికి తాళంవేసి కుటుంబసభ్యులతో సహా వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి రాగా తలుపులు తెరిచి ఉండడంతో చోరీజరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జయన్న పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. బీరువాలో ఉన్న రూ 13వేలు, రెండు తులాల బంగారు చోరీకి గురయిందని ఫిర్యాదులో పేర్కొన్నారని సీఐ తెలిపారు.

ముదిరిన వివాదం

- కేఎంసీ క్యాంటీన్‌కు తాళంవేసిన సంఘం నేతలు
- తాళాలు పగులకొట్టిన నిర్వాహకులు
- ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు



ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న వైద్యులు

కర్నూలు హస్పిటల్, మే 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ క్యాంటీన్‌లో వివాదం ముదిరింది. సోమవారం ఉదయం 11 గంటలకు ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు క్యాంటీన్‌కు తాళాలు వేశారు. ఐదు గంటలు కాకముందే క్యాంటీన్‌కు వేసిన తాళాలను పగల కొట్టి క్యాంటీన్‌ను పునఃప్రారంభించారు. క్యాంటీన్ మాదేనని వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.బ్రహ్మాజీ మాస్టర్ అంటుంటే.. కాదు 30 ఏళ్లకు అగ్రిమెంటు ఉందని, క్యాంటీన్ మాదేనని డా.వరప్రసాద్ అంటున్నారు. మరో పక్క వైద్యుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు డా.బ్రహ్మాజీ మాస్టర్, డా.రామశివ నాయక్, కోశాధికారి డా.డమం శ్రీనివాసులు, ఈసీ సభ్యులు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్‌కు క్యాంటీన్ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. డా.వరప్రసాద్ పేరుతో క్యాంటీన్‌ను నడుపుతున్న అనధికార వ్యక్తులకు పదేపదే నోటీసులు ఇచ్చామన్నారు. సోమవా రం ఉదయం క్యాంటీన్‌కు తాము తాళంవేస్తే.. సాయంత్రం క్యాంటీన్ తాళం పగులకొట్టి అక్రమంగా ప్రవేశించారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వివరించారు. దీనిపై క్యాంటీన్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని గొడవలు జరగకుండా పోలీసులు సహకారం ఉండాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాళం పగులగొట్టడం నేరమని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వివరించారు. దీనిపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్ మాట్లాడుతూ సంఘం నేతల ఫిర్యాదును ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకు వెళ్లానని క్యాంటీన్ వ్యవహారంలో గొడవలు జరగకుండా రోగులకు ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో నెలకొల్పాలని త్రీటౌన్ సీఐకి లేఖలు రాసినట్లు తెలిపారు.

పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాలి

- తమ సంస్థలో పీఎఫ్ఓఏ కెమికల్‌కు దూరం
- మేధావులు ఆరు నెలల్లో నిరూపించాలి
- ఆ తరువాతే ఉత్పత్తి చేపడుతాం
- టీజీవీ గ్రూప్స్ అధినేత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కర్నూలు, మే13 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని టీజీవీ గ్రూప్స్ అధినేత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కోరారు. టీజీవీ ఎస్ఆర్ఏసీ ప్రతిపాదిత విస్తరణలో పీఎఫ్ఓఏ కెమికల్, దాని సంబంధిత లవణాన్ని వాడడం లేదని ఆయన స్పష్టంచేశారు. మంగళవారం నగరంలోని మౌర్యఇన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పీఎఫ్ఓఏ కెమికల్ దిగుమతి చేసుకోవడానికి, వినియోగించడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేదని, ఆ కెమికల్ ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉందని తెలిపారు. తమ పరిశ్రమ నుంచి క్లాసిక్ సోడా, క్లోరోమీథేన్స్ సామర్థ్య విస్తరణ, పీటీఎఫ్ఈ అదనపు ఉత్పత్తుల కోసం ప్రభుత్వ అనుమతి తీసుకున్నామన్నారు. ఈ నెల 14న ప్రజా అభిప్రాయ సేకరణ ఉందని తెలిపారు. ఈ ప్లాంట్ వల్ల ప్రమాదకరమని కొందరు దుష్ప్రచారం చేస్తున్నార న్నారు. క్లాసిక్ సోడా తయారీ పరిశ్రమలు ఏపీలో 4, తమిళనాడులో 4, కేరళలో ఒకటి ఉందని, వివిధ రాష్ట్రాల్లో 35 ఉన్నాయని తెలిపారు. అక్కడ లేని ప్రమాదం కర్నూ లులో ఉంటుందా..? ఇక్కడ మాత్రం ఆందో ళనలు చేయడం ఎంత వరకు న్యాయమని, ఎక్కడ కూడా ఈ పరిశ్రమలు ప్రమాదక రమని చెప్పలేదని అన్నారు. ఆ ప్రాంతంలో పని చేసే కొందరు మేధావులు, ప్రజలు వచ్చి కావాలనే ఇక్కడి ప్రజలను తప్పుతోవ పట్టిస్తూ రెచ్చగొడుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడ తయారయ్యే క్లోరిన్ సుమారుగా 130 కోట్ల ప్రజల తాగునీటిని శుద్ధి చేయడానికి వాడుతు న్నారని, నీటి శుద్ధికి క్లోరిన్ వాడకపోతే ఏటా లక్షల మంది చనిపోయే ప్రమాదం ఉందని గుర్తు చేశారు. ఇక్కడ ఉత్పత్తయ్యే క్లాసిక్ సోడా, హైడ్రో క్లోరిన్ ఆసిడ్ వివిధ రకాల ఔషదాలు తయారీలో ఉపయోగిస్తారని తెలిపారు. ఈ కెమికల్స్ వాడకుండా ఎలాంటి మందులు తయారు చేయలేరన్నారు. తాము విస్తరించబోయే పరిశ్రమలో ఎలాంటి పీఎఫ్ఓఏ కెమికల్, దాని సంబంధిత లవణాన్ని వినియోగించడం లేదని, అనుమానం ఉన్న వ్యక్తులు, శాస్త్రవేత్తలు ఆరు నెలల్లోగా దీనిని నిరూపించాలని, ఆ తరువాతే పీటీఎఫ్ఈ ఉత్పత్తి చేపడుతామని టీజీ వివరించారు. దేశంలో పీటీఎఫ్ఈ ఉత్పత్తి పరిశ్రమలు మూడు ఉన్నాయని, ఇళ్లలో వాడే నీటి పైపుల తయారీకి ప్రపంచంలో విస్తారంగా వినియోగిస్తున్నారని గుర్తు చేశారు. ఇక్కడ తయారయ్యే కార్బన్ టెట్రాక్లోరైడ్‌ను భారత ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతి పొందిన వ్యవసాయ రసాయనాలు తయారీదారులకు మాత్రమే సరఫరా చేస్తున్నామని, ఇందుకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని టీజీ పేర్కొన్నారు. తమ పరిశ్రమ పరిసర గ్రామాల్లో అవసరమైన మౌలిక, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా మన్నారు. వివిధ సామాజికవర్గాల అభివృద్ధి కోసం సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను గౌరు చరిత పంపిణీ చేశారు. కల్లూరు మండలం నెరవాడ గ్రామంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్త పుసులూరు వెంకటరమణ(21) కుటుంబాన్ని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మంగళవారం పరామర్శించారు. ఈమేరకు టీడీపీ జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సహ కారంతో కార్యకర్తల సంక్షేమనిధి నుంచి రూ.5 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే గౌరుచరిత వెంకటరమణ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్ర మంలో మండల టీడీపీ కన్వీనర్ రామాంజనేయులు, గ్రామ టీడీపీ నాయకుడు జాఫర్, సల్కాపురం దేవేంద్రా రెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

గంజాయి తాగి జీవితాలను నాశనం చేసుకోవద్దు

ఓర్వకల్లు, మే 13 (ఆంధ్రజ్యోతి): గంజాయికి అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఈగల్ టీం ఎస్ఐ సుజన్ కుమార్, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం ఈగల్ వ్యవస్థ విభాగాధిపతి ఆర్కె రవికృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని గుమ్మితం తండా సమీపంలో ఉన్న గ్రీన్ కో సంస్థ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కూలీలకు గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలు కష్టపడి సంపాదించిన డబ్బును వ్యసనాలకు ఖర్చుపెడితే తమ పిల్లల చదువు, కుటుంబాలు నాశనమవుతాయన్నారు. గంజాయి తాగితే శరీరం బలహీనమై పనిలో ఉత్సాహం తగ్గుతుందన్నారు. అనంతరం కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కర్నూలు ఎక్సైజ్ సీఐ సుభాషిణి, గ్రీన్ కో ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సూపర్వైజర్ ప్రభాకర్, ఈగల్ సిబ్బంది ఐలీషా, మాసుం వలి, ఫర్హాత్, రమేష్ పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ చోరీ

సి.బెళగల్, మే 13 (ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేస్తుండగా గుర్తు తెలియని దుండగులు మోటార్‌సైకిల్‌ను ఎత్తికెళ్లారు. ఈ ఘటన మండలంలోని కొత్తకోటలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన హరీశ్‌కుమార్ అనే రైతు బైక్‌ను రోడ్డు మీద పెట్టి పొలం పనులకు వెళ్లాడు. పనులు ముగించుకొని వచ్చి చూడగా బైక్ కనపడలేదు. బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

కర్నూలు క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ విద్యార్థి మృతి చెందాడు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన సాల్మాన్ (15) అనే విద్యార్థి గత నెల 30న తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో చున్నీతో ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జరిమానా విధింపు

కర్నూలు క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 18 మంది నిందితులకు కోర్టు జరిమానా విధించింది. గత రెండు రోజులుగా త్రీటౌన్ పోలీసులు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మంది పట్టుబడ్డారు. పట్టుబడిన 18 మంది నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వీరికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న నలుగురిని పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వీరికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించింది.

సీనియర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

కర్నూలు హాస్పిటల్, మే 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాజశేఖర్ మంగళవారం రాత్రి నిద్ర మాతలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. క్యాజువాల్టీలో చికిత్స పొందుతున్న సీనియర్ అసిస్టెంట్‌ను హాస్పిటల్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు పరామర్శించి, మెరుగైన వైద్యం కోసం ఏఎంసీకి తరలించాలని క్యాజువాల్టీ సీఎంవోను ఆదేశించారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం


దగ్ధమవుతున్న కారు

కర్నూలు క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): నగరంలో నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో నందికొట్కూరు రోడ్డులో షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. గద్వాల చెందిన దుర్గేష్ అనే వ్యాపారి కొడుకు కారులో ప్రయాణిస్తుండగా.. స్వల్పంగా మంటలు వ్యాపించాయి. దీంతో కారు అక్కడే ఆపేసి పక్కకు వచ్చాడు. వెంటనే కారులో మంటలు వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కారులోని మంటలను ఆర్పేశారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలుపుతున్నారు.

అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆందోళన

కర్నూలు క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): పోలీసులు తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఉలిందకొండ గ్రామానికి చెందిన నాగన్న, ఆయన భార్య తన కొడుకులతో కలిసి కర్నూలు రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం రాత్రి ఆందోళన చేశారు. ఉలిందకొండ గ్రామంలో తాను గత 45 ఏళ్లుగా సర్వే.నెంబర్.651లో 12 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నానని ఆయన తెలిపారు. ఈ భూమిపై కేజే రెడ్డి కన్ను పడటంతో ఆ భూమిని ఖాళీ చేయించాలని గత కొద్ది కాలంగా పోలీసులు తనపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం తమపై, తమ కొడుకులపై అక్రమ కేసులు బనాయించి పోలీసులు జైలుకు పంపారని, తమపై రౌడీషీట్ తెరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం పత్రికల్లో వార్తలు రావడంతో రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు మంగళవారం రాత్రి తమను స్టేషన్‌కు పిలిపించి దుర్భాషలాడారని ఆరోపించారు. తమపై చేయి చేసుకున్నాడని ఈ విషయంపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

సాధనతో లక్ష్యాలను సాధించాలి

- మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్
- రాష్ట్రస్థాయి ఉషూ పోటీలు ప్రారంభం
- 11 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరు


పోటీలను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేశ్, డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు స్పోర్ట్స్, మే 13(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రమశిక్షణతో కూడిన సాధన చేస్తేనే లక్ష్యాలను సాధించొచ్చునని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. మంగళవారం నగరంలోని బీ.క్యాంపులోని శ్రీలక్ష్మి టీజీ వెంకటేశ్ కల్యాణ మండపంలో జిల్లా ఉషూ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బీ.శంకర్‌శర్మ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 10వ సబ్ జూనియర్, 11వ జూనియర్, సీనియర్ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, రాష్ట్ర ఉషూ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆదివిష్ణు, నరసింహరావు, జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో విజయకుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులుతో కలిసి టీజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉషూ లాంటి మార్షల్ ఆర్ట్స్‌ను నేర్చుకుంటే ఆపద సమయాల్లో తమను తాము కాపాడుకోవడంతో పాటు ఇతరులను రక్షించేందుకు ఈక్రీడ దోహద పడుతుందన్నారు. జిల్లా ఉషూ సంఘం అధ్యక్షుడు డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ క్రీడాకారులు స్నేహభావాన్ని అలవర్చుకుని గెలపోట ములు సమానంగా స్వీకరించి పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. రాష్ట్ర ఉషు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆదివిష్ణు, నరసింహరావులు మాట్లాడుతూ 11 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వహక కార్యదర్శి టి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉషూ సంఘం ఉపాధ్యక్షుడు సుందర్‌రావు, సంయుక్త కార్యదర్శి శివకుమార్, ఎస్ఎస్ శిక్షకుడు సాయి మోహన్, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాశ్ శెట్టి, జిల్లా స్కేటింగ్ సంఘం సీఈవో సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రాణం పోసిన వైద్యులు

- 43 రోజుల తర్వాత రోగి డిశ్చార్జ్


రోగులతో ఐదో యూనిట్ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మే 13(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడికి అరుదైన శస్త్రచికిత్స చేసి కర్నూలు సర్వజన వైద్యశాల సర్జరీ వైద్యులు ప్రాణం పోశారు. బండి ఆత్మకూరుకు చెందిన షేక్ తౌఫిక్ అనే యువకుడు నంద్యాలలో ఐటీఐ చదువుతున్నారు. రంజాన్ పండుగకు ముందు రోజు స్నేహితులతో కలిసి బైక్‌లో వెళ్తూ ఎక్సకవేటర్‌ను ఢీకొట్టాడు. పొట్టభాగం ఛిద్రమైంది. కడుపు పగిలి ప్రేగులు, డియోడినం దెబ్బతిన్నాయి. కటి ఎముక, వెనుక కిడ్నీ దాకా భాగం కూడా దెబ్బతింది. అదే రోజు రాత్రి నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు యువకుడికి ఆపరేషన్ జనరల్ సర్జరీ యూనిట్ చీఫ్ డా.మాధవీ శ్యామల, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.చంద్రా రెడ్డి, డా.శృతి, అనస్థీషియా వైద్యులు డా.సోమశేఖర్ నేతృత్వంలో ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి రోగి ప్రాణాన్ని కాపాడారు. ఐసీయూలో 20 రోజులు ఉంచి రోగికి వైద్యులు చికిత్స అందించారు. ఆ తర్వాత వార్డుకు షిఫ్ట్‌చేసి రోగికి సేవలు అందించారు. రోగి కోలుకోవడంతో 43 రోజుల తర్వాత సర్జరీ ఐదవ యూనిట్ చీఫ్ ప్రొఫెసర్ డా.మాధవీశ్యామల విలేకరుల సమావేశాన్ని నిర్వహించి వివరించారు. 43 రోజులు వైద్యసేవలు చేసి యువకుడైన రోగి ప్రాణాన్ని కాపాడటం చాలా సంతోషంగా ఉందన్నారు.

కదిరి విద్యార్థికి అరుదైన ఆపరేషన్: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన టి.వేణుగోపాల్ (15) ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈబాలుడికి పుట్టుకతో మలద్వారం లేదు. చిన్నప్పుడే ఆపరేషన్ చేసినా ఇబ్బంది పూర్తిస్థాయిలో తొలగలేదు. ఇటీవలే కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో ఐదో యూనిట్‌లో చేరాడు. యూనిట్ చీఫ్ డా.మాధవీ శ్యామల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.చంద్రారెడ్డి, డా.శృతి నేతృత్వంలో బాలుడికి అనలెక్టమీ అనామి సమస్యకు ఆపరేషన్‌ను ఈ నెల 7వ తేదీన విజయవంతంగా నిర్వహించారు. మలద్వారాన్ని పెద్దగా చేసి కండరాలను బలోపేతంచేసి ఆపరేషన్ చేశారు. ఈ సందర్భంగా డా.మాధవీశ్యామల మాట్లాడుతూ మలద్వారం సమస్యను పుట్టిన వెంటనే నిర్వహిస్తారని, అలాంటిది 15 ఏళ్ల తర్వాత ఆపరేషన్ చేయడం చాలా అరుదు అని తెలిపారు.

రైతులను ఉత్తేజపరిచేందుకే బండలాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు మౌళీశ్వరరెడ్డి

ఓర్వకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): రైతులను ఉత్తేజపరిచేందుకే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు మౌళీశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శకునాల గ్రామంలో చెన్నకేశవస్వామి ఉత్సవాల సందర్భంగా తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి పాలపండ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొదటి విజేతగా పెద్దకొట్టాల అయోధ్యనగర్ బోరెడ్డి నారాయణరెడ్డి డీసీఎస్ఆర్ బుల్స్ ఎద్దులు 3101 అడుగుల దూరం లాగి రూ.50వేల నగదును గెలుపొందగా.. దాత సుభాష్ రెడ్డి అందజేశారు. రెండో విజేతగా బి.తాండ్రపాడు ఆకెపోగు వరలక్ష్మి ఎద్దులు 2871 అడుగుల దూరం లాగి రూ.40వేలను దాత కేడీసీసీ మాజీ బ్యాంకు చైర్మన్ మల్లికార్జున రెడ్డి అందజేశారు. మూడో విజేతగా కానాల గ్రామానికి చెందిన రైతు గుండం చెన్నారెడ్డి 2787 అడుగుల దూరం లాగి రూ.30వేలను దాత టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ నగదును అందజేశారు. నాలుగో విజేతగా తెలంగాణా రాష్ట్రం రాయవరం గ్రామానికి చెందిన అక్షరారెడ్డి ఎద్దులు, ఐదో విజేతగా అనంతపురం జిల్లా రామచెరువు గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి ఎద్దులు, ఆరో విజేతగా తెలంగాణ రాష్ట్రం హిందూవాసి గ్రామానికి చెందిన వీరేష్‌గౌడు ఎద్దులు, ఏడో విజేతగా కడప జిల్లా దాసరిపల్లికి చెందిన అశోక్ ఎద్దులు గెలుపొంది నగదు బహుమతిని అందుకున్నాయి. ఈ పోటీలకు వ్యాఖ్యాతగా వాడాల రామనాయుడు వ్యవహరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుట్టపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి, కమిటీ సభ్యులు రామాంజనేయులు ఈజే హరికృష్ణగౌడు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో శివనాగ ప్రసాద్

గూడూరు మే 13(ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో శివనాగ ప్రసాద్ అన్నారు. మంగళవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను వివరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందిం చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పొలాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సర్పంచులు కోరారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులుగా నమోదు చేసుకోండి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీధి వ్యాపారం చేసుకుంటున్న వారంతా సంక్షేమ కార్యదర్శుల ద్వారా చేపట్టిన సర్వేలో నమోదు చేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వీధి వ్యాపారుల కోసం స్మార్ట్ స్ట్రీట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా వీధి వ్యాపా రులను గుర్తించి వారికి గుర్తింపుకార్డు, వెండింగ్ సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. మంగళవారం నుంచి ప్రారంభమైన ఈ సర్వే ఈ నెల 17వ తేదీ వరకు జరుగుతుందని, వివరాల కోసం స్థానిక సచివాలయంలో సంక్షేమ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘం నాయకుడు బత్తుల సంజీవరాయుడు డిమాండ్ చేశారు. ఈనెల 18న నాగేంద్రనగర్‌లోని వడ్డెరసంఘం కార్యాలయంలో అభివృద్ధి కార్యాచరణపై నిర్వహించనున్న సమావేశానికి వడెర్లు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్ర మానికి బెంగళూరుకు చెందిన సంఘం ముఖ్య నాయకులు రాజవీర దేవరాజు ముఖ్య అతిథిగా హాజరవుతార న్నారు. కార్యక్రమంలో మంజుల. జానకిరాముడు, డేరంగుల లక్ష్మీనారాయణ, పల్లపు నాగేశ్వరరావు, రవికుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత అభినందనీయం

కర్నూలు అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): విధుల్లో పని చేస్తూ మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబాలను ఆదుకోవడం అభినందనీయమని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి అన్నారు. మంగళవారం తన చాంబర్లో అసిస్టెంట్ కమిషనర్ వి.హనుమంతరావు, సూపరింటెండెంట్ మచ్చా సుధీర్ బాబుతో కలిసి కుటుంబ సభ్యులకు రూ. 2,08,000 లక్షల నగదును రెండు కుటుంబాలకు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో కానిస్టే బుళ్ల అసోసియేషన్ నాయకుడు గిరిబాబు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసగిస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్ర నాయుడు అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్సీసెల్ జిల్లా చైర్మన్ ఎన్సీ బజారన్న, ఓబీసీ జిల్లా చైర్మన్ సాంబశివుడుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీఎస్సీ పేరుతో 24 వేలకు పైగా ఖాళీగా ఉంటే 16 వేలు పోస్టులు మాత్రమే భర్తీ చేసి మిగతా పోస్టులకు మొండి చెయ్యి చూపిందన్నారు. యూనివర్సిటీల్లో, మెడికల్ కాలేజీల్లో, లైబ్రరీల్లో, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై ఎటువంటి ఆలోచన చేయడం లేదన్నారు. నాయకులు షేక్ ఖాజా హుస్సేన్, వెంకట్, అశోక్, రాజు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత శకునాల జట్టు

ఓర్వకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నకేశవస్వామి ఉత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీలను గ్రీన్‌కో సోలార్ అధికారి శ్రీనివాసరావు, శ్రీనివాసనాయుడులు ప్రారంభించారు. క్రీడాకారులకు గ్రీన్ కో ఆధ్వర్యంలో టీషర్టులను పంపిణీ చేశారు. విజేతలకు కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి నగదును అందజేశారు. మొదటి విజేతగా శకునాల జట్టు నిలిచి రూ.25వేలు, రెండో విజేతగా వడ్డెమాను జట్టు నిలిచి రూ.20వేలు, మూడో విజేతగా ఎంబాయి నిలిచి రూ.15వేలు, నాలుగో విజేతగా బుద్దవరం నిలిచి రూ.10వేలు, ఐదో విజేతగా నూతనపల్లి జట్టు నిలిచి రూ.5వేలు గెలుచుకున్నాయి. విజేతలకు గ్రీన్‌కో సోలార్ సంస్థ వారు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మౌళీశ్వరరెడ్డి, రామాంజనేయులు, హరికృష్ణగౌడు, మధు, శివ పాల్గొన్నారు.

పొదుపు మహిళల స్ఫూర్తి ప్రశంసనీయం

ఓర్వకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళల స్ఫూర్తి ప్రశంసనీయం డీఆర్‌డీఏ పీవీ వైవీ రమణారెడ్డి కొనియాడారు. మంగళవారం మండల కేంద్రమైన ఓర్వకల్లులోని మండల మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ ఇస్తున్న బ్యూటీషియన్స్, మగ్గం వర్క్స్ శిక్షణా కేంద్రాలను ఆయన పరిశీలించారు. మండల గౌరవ సలహాదారాలు విజయభారతి శిక్షణపై డీఆర్‌డీఏ పీడీకి తెలిపారు. అనంతరం ఆంజేయస్వామి పూజలు చేశారు. కార్యక్రమంలో డీపీఎం నరసమ్మ, ఏపీ వెంకట్రామిరెడ్డి, సీసీఏలు, వీవోఏలు, మహిళలు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

గూడూరు మే 13 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే తెలుగు దేశం పార్టీ ధ్యేయమని 178 బూత్ ఇన్‌చార్జి, పార్టీ నాయకుడు అక్కలదేవి గిడ్డయ్య అన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలో గిడ్డయ్య ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలకు సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ చిన్న కష్టమొచ్చినా టీడీపీ అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ 'పది' ఫలితాల్లో
మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 13(ఆంధ్రజ్యోతి): మంగళవారం ప్రకటించిన పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల 295 మంది విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని పాఠశాల డైరెక్టర్ రాజశే ఖర్ తెలిపారు. ఐవీ.లలిత్ కుమార్ రెడ్డి 491/500 మార్కులు, సి.శివహర్షిల్ రెడ్డి 488, ఎ.అభషాయ్ 487 మార్కులు సాధించారన్నారు. 28 మంది విద్యార్థులు 95 శాతం పైగా, 76 మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినం దించారు. అదేవిధంగా ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల విద్యార్థి చిరంజీవి శివహర్షిల్ రెడ్డి 488/500 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు. మాతృభాష తెలుగులో 100/100 మార్కులు సాధించాడు. అలాగే 97.6 శాతం మార్కులతో ప్రతిభ కనబరిచిన శివహర్షిల్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

మాంటిస్సోరి ఇండస్ విద్యార్థులు..


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో మాంటిస్సోరి ఇండస్ పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగిం చారు. పాఠశాల నుంచి మొత్తం 785 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 100 శాతం ఉత్తీర్ణతతో విజయకేతనం ఎగురవేశారు. సి.హర్షంత్ 488/500 మార్కులు, పి.సురేంద్రనాథ్ రెడ్డి 488, విక్రం ఆదిత్య 484 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, తీర్చిదిద్దిన అధ్యా పకులను పాఠశాల యజమాన్యం అభినందించారు.

మాంటిస్సోరి ఒలంపస్ విద్యార్థులు..



కర్నూలు ఎడ్యుకేషన్, మే 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో పంచలింగాలలోని మాంటిస్సోరి సీబీఎస్ఈ పాఠశాల ఒలంపస్ బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపారు. మేడ నరసింహ 482/500 మార్కులు, డి.మొహమ్మద్ తైసీర్ 481/500 మార్కులు సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను పాఠశాల యజమాన్యం అభినందించారు.

రిడ్జ్ పాఠశాల విద్యార్థులు..


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో రిడ్జ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చినట్లు సీఈవో గోపినాథ్ తెలిపారు. మొత్తం 111 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 90 శాతం పైనే, 30 మంది విద్యార్థులు 80 శాతంపైన 63 మంది విద్యార్థులు, 70 శాతం పైగా 84 మంది విద్యార్థులు, 60 శాతం పైగా 102 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. టి.కేధార్ రెడ్డి 486, ఎస్.నందినిరెడ్డి 479, టీవీ తేజోదయ్ 478, వి.దాక్ష 475, ఎస్. గౌతం 474, పెరుగు లక్ష్మి గాయత్రీ 473 మార్కులు సాధించారు. పతిభ కనబర్చిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులను సీఈవో గోపినాథ్, కో-సీఈవో సౌమ్య గోపినాథ్, డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపాల్ రాజ్‌కమల్, కోఆర్డినేటర్ హరికృష్ణలు అభినందించారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పోటీలు

కోడుమూరు రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమలగుర్తిలో లక్ష్మీనరసింహ ఈరన్నస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన పొట్టేళ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈపోటీలో మునకలపెంట వీరాంజనేయులుకు చెందిన పొట్టేలు మొదటి బహుమతి రూ. 20వేలు, ముడుమలగుర్తి భైరవ రూ. 15వేలు, నంద్యాల రాక్షసి రూ. 10వేలు, ఆంధ్రకట్ల డాన్ రూ. 8వేలు, రాయల్ శంభాజీ రూ. 5 వేలు, అనంతపురం సిద్ధన్న పొట్టేలు రూ. 4 వేలు గెలుపొందాయి. విజేతలకు దాతలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రంగన్నస్వామి పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

కర్నూలు అగ్రికల్చర్, మే 13(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం ఈ నెల 20వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ కర్నూలు జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సీఐటీయూ మార్కెట్‌యార్డు యూనియన్ గౌరవాధ్యక్షుడు రాముడు, నగర కార్యదర్శి సాయి బాబా మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మికి సీఐటీయూ నాయకులు మంగళవారం సమ్మె నోటీసును అందజేశారు. మార్కెట్ యార్డు యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు నాగరాజు, మనోహర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

విష్ణుకు సన్మానం

కర్నూలు రూరల్ మే 13(ఆంధ్రజ్యోతి): కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన డి.విష్ణువర్ధన్‌రెడ్డిని కర్నూలు మండల టీడీపీ నాయకుడు కేఈ వేమన్నగౌడ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నంద నపల్లె, మిలిటరి కాలనీ, భూపాల్‌నగర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విష్ణువర్ధన్‌రెడ్డిని శాలువ కప్పి సన్మానించారు.

22న కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


మాట్లాడుతున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన కురువ విద్యార్థులకు ఈ నెల 22న ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు జిల్లా కురువ సంఘం అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, ప్రధాన కార్యదర్శి కే.అనిత తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో పెద్దపాడు రోడ్డులోని బీరప్ప స్వామి ఆలయం ప్రాం గణంలో జరుగుతుందని, ఉదయం 10 గంటలకు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పాల సుంకన్న, పెద్దపాడు ధనుంజయ, ఉరుకుందు, వెంకటే శ్వర్లు, కేసీ నాగన్న, శ్రీనివాసులు, తిరుపాల్, బి.బాలరాజు, పుల్లన్న, కే.వెంకటేశ్వర్లు, మద్దిలేటి, దేవేంద్ర పాల్గొన్నారు.

దారి బాగుపడింది





మండలంలోని జొన్నగిరి గ్రామ శివారులోని అశోకుని శిలాశాసనాలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలు పడి కంకర తేలి, పర్యాటకులు ఇబ్బందులు పడేవారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన ఏడాది లోపే రూ.92 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు రహదారి దుస్థితిని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా వారు నిధులు మంజూరు చేయడతో నూతన రహదారి నిర్మించారు. దీంతో పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. -తుగ్గలి

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

క్రిష్ణగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాల కోసం అర్హులైన ముస్లిం, మైనార్టీలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మోహన్ కుమార్ కోరారు. మంగళవారం మాట్లాడుతూ స్లాబ్-1 కింద రూ.2లక్షలు, స్లాబ్-2కింద రూ.2.5లక్షలు, స్లాబ్-3కింద రూ.4 లక్షలను ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ రుణంలో సబ్సిడీ 50 శాతం కాగా, బ్యాంకు రుణం 50శాతం ఉంటుందన్నారు. వెల్దుర్తి యూనియన్ బ్యాంక్, చిట్యాల, డోన్, క్రిష్ణగిరి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, వెల్దుర్తి ఎస్‌బీఐ పరిధిలో మొత్తం 18 యూనిట్‌లు మంజూరయ్యాయన్నారు.ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో, అంగన్‌వాడీలు

వెల్దుర్తి/టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): బాలలకు తమ హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలని సీడీపీవో లూక్, సూపర్‌వైజర్లు శ్రీదేవి, జయభారతి అన్నారు. సోమవారం వెల్దుర్తి ప్రాజెక్టు రామళ్లకోట సెక్టార్‌లోని పుల్లగుమ్మి అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం నిర్వహించారు. బాలబాలికులు పనులకు వెళ్లవద్దని, చదువుకుంటే అభివృద్ధి, విలువలు తెలుస్తాయన్నారు. ఆపదలో ఉంటే బాలికలు 1098కు కాల్ చేయాలని సూచించారు. దిశా యాప్‌ను మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కే, వెంకటేశ్వరమ్మ, ఏఎన్ఎం పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు సులోచన, ఆదిలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మే13 (ఆంధ్రజ్యోతి): తమకు నెలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీడీపీవో కార్యాలయం సూపర్వైజర్‌కు వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం ఇవ్వడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపం చేస్తున్నాయని ఆరోపించారు. పద్మా, వరలక్ష్మి, సరోజ, తిప్పన పాల్గొన్నారు.

సారా తయారీదారు అరెస్టు

ఆదోని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బావాజీపేటకు చెందిన బోయ శివను ఇస్పీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఇస్వీ కొండల్లో సారాను తయారు చేస్తుండగా అతని వద్ద నుంచి 25లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాయక్ తెలిపారు.

నిర్మాణాలను వేగవంతం చేయాలి

మద్దికెర, మే 13 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ విజయకుమార్ సూచించారు. మంగళవారం మద్దికెరలో గృహాలను పరిశీలించారు. మండలంలోని బీఎల్, ఎల్ఎల్, ఆర్ఎల్ స్టేజీలో ఉన్న గృహాలను నిర్మిస్తున్న లబ్దిదారులు వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు రూ.2.30 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు ఇస్తున్నట్లు తెలిపారు. దళారులను ఆశ్రయించవద్దని, ఇప్పటివరకు గృహాలకోసం 1,800 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. డబ్బును లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తారన్నారు. హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ ఉన్నారు.



గృహాన్ని పరిశీలిస్తున్న డీఈ

పిడుగుపాటుతో ఎద్దు మృతి

ఆస్పరి, మే13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తూకురు గ్రామంలో మంగళవారం పిడుగుపాడుకు ఎద్దు మృత్యువాత పడిందని యజమాని మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల మేరకు.. అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసందని, పిడుగు పడడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం రైతును ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, నాగరాజు, ఆంజనేయులు కోరారు.



ఎద్దు వద్ద రోదిస్తున్న యజమాని

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని టౌన్, మే13 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహ నిర్మాణాల్లో నాణ్యత పాటించని థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని బీజేపీ కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ పరిధిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. కాంట్రాక్టర్ ప్రభుత్వానికి అందించిన లెక్కల ప్రకారం 2,558 ఇళ్లను పూర్తి చేసినట్టు ఉండగా, క్షేత్ర స్థాయిలో మాత్రం అన్ని పూర్తికాలేదని స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నాసిరకంగా నిర్మించిన గృహాలను ప్రజలకు ఇవ్వాలని చూడటం సరి కాదన్నారు. కౌన్సిలర్ సురేష్, మహాదేవ్, నాగార్జున, కిరణ్, రమేష్, ఆచారి, మరియాని చెన్న బసప్ప, టీసీ నాగరాజు, రవిశంకర్, అంజయ్ కుమార్, శ్రీనివాస్ ఆచారి, చంద్ర, శివ పాల్గొన్నారు.



నాణ్యతను పరిశీలిస్తున్న నాయకులు

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

● వైస్ చైర్మన్ నరసింహులుతో టీడీపీ కౌన్సిలర్ పార్వతి వాగ్వాదం



వీసీ నరసింహులును ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ పార్వతి

ఆదోని టౌన్, మే13 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. మంగళవారం సాయంత్రం ఇన్‌చార్జి చైర్మన్ ముల్లా గౌస్ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ముందుగా ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన సైనికుల ఆత్మశాంతి కోసం రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. అనంతరం కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ, సమావేశాల్లో కౌన్సిలర్లు సూచించిన విషయాలను అధికారులు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యుల సలహాలను ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. టీడీపీ కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ, ఝాన్సీ లక్ష్మీబాయి. కూరగాయల మార్కెట్ వేలాల అంశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. వీసీ నరసింహులు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని, సర్కారు ధర తగ్గించి వేలం వేయడానికి అంగీకరిస్తే వేలం వేసే అవకాశం ఉంటుందని సమాధానం ఇచ్చారు. ఇందుకు పార్వతి అంగీకరించకుండా గతంలో వేసిన ఎద్దుల సంత, మేకల సంతలను కూడా తక్కువ ధరకు వేలం పాడిన వారికే కూరగాయల మార్కెట్‌ను కూడా తక్కువ ధరకే వేలాలు వేయాలని చూస్తున్నారని వైస్ చైర్మన్‌తో వాగ్వావాదానికి దిగారు. అనంతరం ఈ అంశాన్ని మంజూరు చేయడం కొస మెరుపు. మూడు వారాల క్రితం ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ముల్లా గౌస్‌కు ఈ సమావేశం మొదటిది, చివరిది కావడంతో సభ్యులు ఆయనతో గ్రూప్ ఫోటోలు తీసుకున్నారు. కమిషనర్ కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, హెల్తాఆఫీసర్ డా సందీప్, ఆర్‌వో నాసిర్ హుస్సైన్, డీఈ రామ మూర్తి, గోపి పాల్గొన్నారు.

చైర్మన్‌గా ఈశ్వర్ ఎంపిక హర్షణీయం

● టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర



తుగ్గలి, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్‌గా ఈశ్వర్‌ను ఎంపిక చేయడం హర్షణీయమని శాలి వాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. మంగళవారం తుగ్గలిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ పేదల పార్టీ అని, పేదల అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు పార్టీ కోసం కష్టపడిన వారందరినీ గుర్తించి పదవులు ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేయడమే కాకుండా, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు.

బాలికలు విశ్వాసంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నిర్మల

దేవనకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): బాలికలు విశ్వాసంతో ముందుకు సాగాలని ఐసీడీఎస్ పీడీ నిర్మల సూచించారు. మంగళశారం దేవనకొండ అంగన్‌వాడీ కేంద్రం -1లో కిశోరి వికాసం వేసవి శిక్షణ ప్రణాళిక నిర్వహించారు. జిల్లాలోని 1,886 అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలికల మనుగడ, హక్కులు, పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థినులు 3 లక్షలకు పైగా ఉన్నారని అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల్లోపు 15 నుంచి 20 మంది బాలికలను గ్రూపుగా ఏర్పాటు చేసి, అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీడీపీవో మద్దమ్మ, సూపర్‌వైజర్లు శివలింగమ్మ, షాహిన, వెలుగు ఏపీఎం నర్సన్న, టీచర్లు జ్యోతి పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ ఎంపికకు మార్గం సుగమం

● 19న ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల కమిషనర్ ఉత్తర్వులు



లోకేశ్వరి(ఫైల్)

ఆదోని టౌన్, మే13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపికకు మార్గం సుగమమైంది. ఇదివరకు చైర్‌పర్సన్‌గా ఉన్న వాల్మీకి శాంతను వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంతో పదవి నుంచి దింపేసి, వైస్ చైర్మన్ ముల్లా గౌస్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా ఎంపిక చేయడం చకచకా జరిగిపోయాయి. మిగిలిన పది నెలలకు ఆయనే చైర్మన్‌గా కొనసాగుతారని భావించారు. అయితే మూడా గడవక ముందే చైర్మన్ ఎంపిక కోసం ఈనెల 19వ తేదీన ఎన్నికలు నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సహానే ఉత్తర్వులను జారీ చేశారు. చాలా కాలంగా వైసీపీకి చెందిన 42వ వార్డు కౌన్సిలర్ లేకేశ్వరిని చైర్‌పర్సన్‌గా ఎంపిక చేయాలనుకొన్న వైసీపీ కౌన్సిలర్లకు మార్గం సుగమయింది. ఏడాదినుంచి చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తూ లేకేశ్వరి ప్రయత్నాలు ఫలించాయని వారు చర్చించుకొంటున్నారు.

సచివాలయ ఉద్యోగి అదృశ్యం



రాంగోపాల్(ఫైల్)

దేవనకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచాపురం గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి రాంగోపాల్(25) మూడు రోజులుగా కనిపించకుండా పోయారు. తండ్రి గిడ్డయ్య, పోలీసుల కథనం మేరకు.. రాంగోపాల్ గోనెగండ్ల మండలం గాజులదిన్నె సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆదివారం నుంచి కనపడకుండాపోవడంతో తండ్రి గిడ్డయ్య దేవనకొండ పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.

రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది

ఆదోని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని కేవీపీఎస్ కార్యదర్శి తిక్కన్న ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం డీటీ గుండాల నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

కార్మిక చట్టాల రక్షణకు ఉద్యమించాలి

ఆదోని అగ్రికల్చర్, మే13 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాల రక్షణకు ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం కార్యాలయంలో భారత కార్మిక సంఘాల కమిటీ సమావేశం నిర్వహించారు. జాతీయ అంతర్జాతీయ మితవాద శక్తులు ఆధిపత్యం వహించి ప్రజాస్వామ్య శక్తులపై దాడులు చేస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగంపై నమ్మకం లేని బీజేపీ పాలకులు కార్మిక చట్టాలను రద్దుచేయడానికి పూనుకోవడం దారుణన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, కార్పొరేట్‌కు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 20న తలపెట్టిన సార్విత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు వెంకప్ప, కే ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



బోనాలు తీసుకెళుతున్న భక్తులు

వెల్దుర్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో వెలసిన రేణుకా ఎల్లమ్మకు మాదాసి కురువ సామాజిక వర్గానికి చెందిన వారు సామూహికంగా బుధవారం బోనాలు తీసుకెళ్లారు. నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. బెస్తలు కూడా బోనాలు సమర్పించారు.

విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహాలను తీసుకొస్తున్న గ్రామస్తులు

హాలహర్వి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలేహాల్ గ్రామంలో లసుమమ్మ, సవారమ్మ విగ్రహాలను గ్రామస్థులు మంగళ వారం ప్రతిష్టించారు. విగ్రహాలకు మేళతాళాలు మంగళహారతులతో స్వాగతం పలికారు. వేద పండితులు అభిషేకం, ఆకుపూజ నిర్వహించారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

● తహసీల్దార్ హుశేన్ సాహెబ్

మద్దికెర, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థలాలు లేని నిరుపేదలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు పొందని వారు దరఖాస్తు చేసుకోవాలని సర్వే చేసి అందజేస్తామన్నారు. వీఆర్వోలు అర్హులను గుర్తించి నమోదు చేయించాలన్నారు. దళారులను ఆశ్రయించవద్దని, నేరుగా లబ్ధిదారులే దరఖాస్తులను వీఆర్వోలకు ఇవ్వాలని తెలిపారు. వీఆర్వోలు రంగస్వామి, రషీదు, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

వెల్దుర్తి, మే 13(ఆంధ్రజ్యోతి): మండల స్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుహాసినమ్మ తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దేశాయి లక్ష్మీదేవి అధ్యక్షతన సమావేశం ఉంటుందని, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

తుగ్గలి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి జడ్పీ పాఠశాలలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, సర్పంచ్ ఓబులేసు, బీసీ సెల్ నాయకులు సంగాల కృష్ణ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్యాంబాబు సూచన మేరకు కర్నూలు సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

టీడీపీ ప్రభుత్వం రైతులది

తుగ్గలి, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం రైతులదని, వారిక అభివృద్ధి కోసమే డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను వంద శాతం రాయితీతో ఇస్తున్నారని తెలుగు రైతు ఉపాధ్యక్షుడు బాలన్న, మిద్దె రవికుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం జొన్నగిరిలో మాట్లాడుతూ గత ప్రభుత్వం పరికరాలు అందించలేదన్నారు. రైతులు రూ.వేలకు వేలు వెచ్చించి కొనుగోలు చేశారని, టీడీపీ రాగానే సబ్సిడీ పరికాలు ఇస్తుందన్నారు.

అందుబాటులో ఎరువులు

మద్దికెర, మే 13 (ఆంధ్రజ్యోతి):రైతుల కోసం ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో రవి అన్నారు. మంగళవారం ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీటర్లు ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మాలన్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో రైతులు బిల్లులు తప్పక తీసుకోవాలన్నారు.

ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

మద్దికెర, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఎంపీపీ అనితా యాదవ్, తహసీల్దార్ హుశేన్ సాహెబ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజన్న యాదవ్ సూచించారు. మంగళవారం కర్నూలు గౌరి గోపాల్ హస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక సచివాల యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రోగులకు మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ యాదవ్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, సర్పంచ్ సుహాసిని, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు యాదవ్, తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడు, ఎంపీటీసీలు ఆంజనేయులు కాల్వ రామకృష్ణ ఉన్నారు.

మూడోరోజుకు పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం చేపట్టిన పాదయాత్ర మూడోరోజుకు చేరుకొంది. మంగళవారం ఉదయం పెద్దపెం డేకల్లు, చిన్న పెండేకల్లు, సాంబగల్లు, నెట్టేకల్లు గ్రామాల్లో యాత్ర సాగింది. నాయకులు లింగన్న, రామాంజనే యులు, ఉచ్చీరప్ప మాట్లాడుతూ ఏ గ్రామంలో చూసినా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటితో పాదయాత్ర ముగిస్తుందన్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఫాస్ట్‌ఫుడ్‌తో ఆరోగ్యానికి ముప్పు

● పల్లెలకు పాకిన సంస్కృతి ● రోగాలబారిన పిల్లలు, యువత, పెద్దలు ● పత్తాలేని ఫుడ్‌సేఫ్టీ అధికారులు

ఆలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కనిపించే చిరుతిళ్లు ఇప్పుడు లేవు. పల్లెలకు కూడా ఫాస్ట్‌ఫుడ్ సంస్కృతి పాకింది. చిన్నారులు, యువత, పెద్దలు కూడా ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడ్డారు. సంప్రదాయ వంటకాలు తినేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. ప్రత్యేకంగా యువత ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటుపటంతో, వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.



వాసనతో ఆకర్షణ..

తయారీదారులు ఫాస్ట్‌ఫుడ్స్ ఘుమఘుమలాడే వాసనలు, రంగులతో తయారు చేస్తున్నారు. దీంతో అందరు సుళువుగా ఆకర్షితులవుతున్నారు.

పల్లెలకు విస్తరించిన ఫాస్ట్ ఫుడ్ కల్చర్

ఒకప్పుడు పెద్ద పెద్ద నగరాల్లో మాత్రమే కనిపించిన ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ చిన్న చిన్న పల్లెలకు కూడా విస్తరిస్తోంది. దీనికి అలవాటు పడ్డ పిల్లలు, యువత, పెద్దలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

పత్తాలేని ఫుడ్ సేఫ్టీ అధికారులు

ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో విక్రయించే కల్తీ ఆహార పదార్థాలను తనిఖీ చేయాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిల్వచేసిన చికెన్, వెనిగర్, ఇలా రుచి కోసం వేసే రంగులు, కలర్ కూడా ఆరోగ్యానికి ప్రమాదంగా పరిణమించే అవకాశం ఉంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేసి, ఆహార కల్తీని నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

నాసిరకం సరుకులతో తయారు

ఫాస్ట్ ఫుడ్స్‌ను నిర్వాహ కులు నాసిరకమైన సరుకుతో తయారు చేస్తున్నారు. దీంతో దీన్ని తిన్నవారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఫ్రైడ్ రైస్, గోబీ మంజూరియా, న్యూడిల్స్ తయారీకి ఉపయోగించే క్యాబేజీ, టమాటా, ఉల్లిపాయలు, కొత్తిమీరను మార్కెట్లలో తక్కువ ధరకు లభించే నాసిరకమైన వాటిని కొలనుగోలు చేసి తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. పగిలి పోయిన గుడ్లు, పాడైన చికెన్ వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రంగులు కలిపిన ఆహారం ప్రమాదకరం



రంగులు కలిపిన ఆహార పదార్థాలు తింటే పిల్లల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. నిల్వ చేసిన చికెన్, పగిలి పోయిన కోడిగుడ్లు తింటే గ్యాస్, అల్సర్ సమస్యలు వస్తాయి. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆహారాన్ని తినేవారికి 80 శాతం మంది గ్యాస్టిక్, అల్సర్‌తో బాధ పడుతున్నారు. సాధ్యమైనంత వరకు వీటిని మానాలి. - **డా.రామకృష్ణ, చిన్నపిల్లల వైద్యుడు, ఆలూరు**

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

● రక్షణ కంచెలు ఏర్పాటుచేయని అధికారులు ● చిరు దుకాణాల పక్కనే ఏర్పాటు

ఎమ్మిగనూరు టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ శాఖాధికారులు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌పార్మర్లు ప్రమాదకరంగా మారాయి. కొన్నిచోట్ల ప్రమాదాలు జరగకుండా వీటి చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి మరికొన్ని చోట్ల ఏర్పాటు చేయలేదు. దీంతో అయా ప్రాంతవాసులు భయాందోళనలకు గురవు తున్నారు. కొన్నింటికి రక్షణ కంచెలు వేసి సంవత్సరాలు కావడంతో వాటి కంచె తొలగిపోయాయి. మరి కొన్నిచోట్ల కంచె వేయడమే మరిచిపోయారు. వైఎస్ఆర్ సర్కిల్‌లో కంచె వేసి కొన్ని సంవత్సరాలు కావడంతో అది పూర్తిగా తొలగిపొయింది. సంత మార్కెట్ దగ్గర కూడా అదే పరిస్థితి. ఇక్కడ ట్రాన్స్‌పార్మర్‌కు అనుకోని చిరు దుకాణం కూడా ఉంది. 11వ వార్డు వాటర్ ట్యాంక్ దగ్గర ఆటోస్టాండ్ ఉంది ఇక్కడ ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇక్కడ కూడా కంచె లేకపో వడంతో ఎప్పుడు ఏప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందు తున్నారు. అలాగే గోనెగండ్ల హైవే రోడ్డులో, కమిటీ రోడ్డులో, ఆర్‌టీసీ బస్టాండ్ దగ్గర ట్రాన్స్‌పార్మర్‌కు కంచె లేదు. రద్దీగా ఉండే పలు చోట్ల ట్రాన్స్‌పార్మర్‌లు పెట్టి



సంతమార్కెట్ దగ్గర ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



గుడి పక్కన ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కొన్ని సంద ర్భాలలో వర్షాకాలంలో ట్రాన్స్‌పార్మర్‌పై చెట్ల కొమ్మలు పడి ఎర్త్‌అయ్యి నిప్పు రవ్వ లు లేస్తున్నాయి. ఈట్రాన్స్‌పార్మర్‌ల పక్కనే అక్కడక్కడ చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటుచేసుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారు. ప్రధానంగా ఆర్‌టీసీ బస్టాండ్, వైస్ ఆర్ సర్కిల్, సంత మార్కెట్లో ట్రాన్స్‌పార్మర్‌లున్నా కంచెలు లేక ప్రమాదాలు జరిగితే ఎవరిది బాధ్యతఅని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌పార్మర్లకు కంచెలు ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

గడ్డివామి దగ్ధం

ఎమ్మిగనూరు రూరల్, మే13(ఆంధ్రజ్యోతి: మండలంలో గడ్డివాములు దగ్ధమై రూ.1.95లక్షల ఆస్థినష్టం జరిగింది. గ్రామానికి చెందిన రైతులు కేశన్న, మల్లకల్లు, మల్లికార్జున, వెంకటేష్ పశువుల మేత కోసం దాదాపు 20 ట్రాక్టర్ల వరిగడ్డితో పాటు, వేరుశనగ, జొన్న పొట్టును కలిపి వామిగా వేసుకున్నారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దానికి నిప్పటించడంతో మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఎస్ఎఫ్‌వో రామాంజనేయులు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.1.95లక్షల ఆస్థినష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారి రామాంజనేయులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఐసీడీఎస్ కార్యాలయానికి స్థలం కేటాయింపు

మంత్రాలయం, మే 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం ఐసీడీఎస్ కార్యాలయానికి పది సెంట్ల స్థలాన్ని కేటా యించినట్లు మంత్రాలయం ఐసీడీఎస్ సీడీపీవో నరసమ్మ తెలిపారు. మంగళవారం సూగూరు రోడ్డులోని బృందావనం రియల్ ఎస్టేట్ వారు గ్రామ పంచాయతీకి పది సెంట్ల స్థలాన్ని ఇవ్వడానికి పంచాయతీ సర్పంచ్ అంగీకారం తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు మరో రెండు రోజుల్లో గ్రామ పంచాయతీ ఆమోదంతో పది సెంట్ల స్థలాన్ని ఐసీడీఎస్ సీడీపీవోకు అందజేస్తామని సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. ఈ స్థల పరిశీలనలో సూపర్ వైజర్ భాగ్యలక్ష్మీబాయి, గంగ పుత్రుల సంఘం అధ్యక్షులు హండె శాంతయ్య, జీనియస్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ రాఘవేంద్రలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను తనిఖీ చేసిన పీడీ



నీటికుంట పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకట రమణయ్య

పెద్దకడుబూరు , మే13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో జరిగే ఉపాధి హామీ పనులను పీడీ వెంకటరమణయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద తవ్విన నీటికుంటల పనులతో పాటు వివిధ రకాల పనులను ఆయన పరిశీలించారు. అనం తరం కూలీలతో మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులు ఫారంఫండ్స్ పనులు చేయించుకోవాలన్నారు. రైతులు ప్రభుత్వం రాయితీ కింద అందజేస్తున్న పండ్ల మొక్కలను సాగుచేసి లబ్ధి పొందాలన్నారు. కార్య క్రమంలో లోకేశ్వర్, నందకిశోర్, చంద్రశేఖర్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు

కౌతాళం, మే 13(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా వెలిసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసు ఉత్సవాలు మంగళవారం జియారత్ కార్యక్రమంతో ముగిసింది. ఈ ఉత్సవాలలో భాగంగా చివరి రోజు దర్గాలో దర్గా ధర్మకర్త, పీఠాధిపతి ఖాదర్ భాష చిష్తి, పెద్ద మున్న పాషలు స్వామివారి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. అనంతరం ఉరుసుకు ముగింపు సూచికగా దర్గా నుంచి ఫక్కీర్ సాబ్‌లతో కలిసి పీర్ల కట్ట వద్దకు చేరుకుని పీర్లదేవుళ్లకు పూజించి కట్ట వద్ద జెండాను ఎగరవేసి ఉరుసు ముగింపు సూచికను తెలియ జేశారు. అనంతరం అక్కడ నుంచి ఫక్కీర్‌సాబ్‌లను తమ గమ్య స్థానాలకు సాగనంపారు. ఐదు రోజుల పాటు జరిగిన ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్గా వారు ప్రత్యేక సదుపా యాలు కల్పించి వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం చేశారు.

గాలివాన బీభత్సం

గోనెగండ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్ల తో పాటు హెచ్ కైరవాడి, గాజులదిన్నె, ఐరన్‌బండ, గంజహళ్లి, ఎన్నెకండ్ల గ్రామాలలో సోమవారం అర్థ రాత్రి ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈదు రు గాలుల కారణంగా 30 నుంచి 100 విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. అలాగే దాదాపు 10 విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ గాలివానకు కాలిపోయాయి. మండలంలోని పలు గ్రామాలు రెండు రోజులుగా అంధకారంలో మగ్గుతున్నాయి. విషయం తెలుసుకున్న మండల విద్యుత్ అధికారులు స్తంభాలు ఎన్ని కింద పడిపోయాయో తెలుసుకొని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



రోడ్డు కు అడ్డంగా పడి ఉన్న విద్యుత్ స్థంభం

కార్మికులతో చెలగాటం ఆడితే ఊరుకునేది లేదు



సీడీపీవోకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

మంత్రాలయం, మే 13 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం కలిగించే చట్టాలను తీసుకువచ్చి వారి జీవితాలతో చెలగాటం ఆడితే ఊరుకునేది లేదని సీఐటీయూ నాయకులు జయరాజు, మండల కార్యదర్శి భీమేశ్వరీ అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీడీపీవో నరసమ్మకు వినతి పత్రం అందజేశారు .అసంఘటిత కార్మికులు, రైతు కూలీలు, పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కళ్యాణి, శ్వేత, ప్రమీల, ఆశా వర్కర్లు శారద, లక్ష్మీ, డానియేలు, తిక్కయ్య రామారావు ఉన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందవరం, మే 13(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ఆగిపో యిం దని వైకాపా నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కాశీంవలి, సత్యారెడ్డి హెచ్చరించారు. మంగళ వారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి వ్యాధికి సంబంధించిన ఒక్కొక్క వైద్యున్ని నియమించడానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి క్రిటికల్ కేర్ సెంటర్ ఏర్పాటుకు కృషిచేస్తున్నారని గుర్తించు కోవాల న్నారు. ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు హైవే తీసుకు వచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి నితిన్ గడ్కారిని ఎమ్మెల్యే బీవీ కలిశారన్నారు. మాటలు కాదు, గ్రామాల్లోకి వెళ్లి చూడండి కూటమి అభివృద్ధి అంటే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో రామకృష్ణరెడ్డి, షరిఫ్, యల్లప్ప పాల్గొన్నారు

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న పూలే అంబేడ్కర్ సొసైటీ సభ్యులు

ఎమ్మిగనూరు టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనాథ శవానికి పూలే అంబేడ్కుర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారు అంత్యక్రియలు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సొసైటీ వ్యవస్థాపకులు నర్సన్న మాట్లాడుతూ పట్టణ సీఐ శ్రీనివాసులు ఇచ్చిన సమాచారంతో గోనెగండ్ల రోడ్డు నందు గల బీసీ శ్మశాన వాటిక దగ్గర మృతదేహం కనిపించడంతో పోస్టుమార్టం చేసిన తరువాత అనాథ శవంగా గుర్తించి అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో రాము, ఎంకోబు, నిఖిల్ తదిత రులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు



అల్లిపీరస్వామి ఉరుసులో భక్తుల సందడి

ఎమ్మిగనూరు రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడికల్లు గ్రామంలో వెలసిన సద్గురు అల్లీపీరస్వామి ఉరుసును పీఠాధిపతి సయ్యద్ ఘాజీ హుసేన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ఫాతేహాలు చేశారు. భక్తులు రాత్రి భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉరుసుని పురస్కరిం చుకుని దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు దాదాపు 20వేల మంది భక్తులు కర్నాటక, తెలంగాణ, ఆంధ్రా, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు ప్రత్యేక పోలీసు బందో బస్తును ఏర్పాటు చేశారు.

చైర్మన్‌గా ఈశ్వర్ ఎంపిక హర్షణీయం

● టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర



తుగ్గలి, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాలివాహన కార్పొరేష న్ చైర్మన్‌గా ఈశ్వర్‌ను ఎంపిక చేయడం హర్ష ణీయమని శాలి వాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. మంగళవారం తుగ్గలిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ పేదల పార్టీ అని, పేదల అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. సీఎం చంద్ర బాబు పార్టీ కోసం కష్టపడిన వారందరినీ గుర్తించి పదవులు ఇస్తున్నా రన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేయడమే కాకుండా, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత టీడీపీకే దక్కుతుం దన్నారు.

ఏడో రోజు కొనసాగుతున్న సమ్మె

● రేపటి నుంచి నీటి సరఫరా, వీధి దీపాలు ఆపివేసి నిరవధిక సమ్మెలో వెళ్తున్న సిబ్బంది



సమ్మె నిర్వహిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు, న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఏడో రోజు సమ్మె చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్, వైఎస్ఆర్ సర్కిల్ వరకు 'హలో ఇంజనీర్ చలో విజయవాడ' నినాదాలు చేసుకుంటూ వెళ్లి అనంతరం మునిసిపల్ కార్యాలయం ఎదుట సమ్మెకు కూర్చొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి ,సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై ప్రహ్లాదరాయలు



గజవాహనం పై విహరిస్తున్న ప్రహ్లదరాయలు

మంత్రాలయం, మే 13(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మ ఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. మంగళవారం వైశాఖ పాడ్యమిని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య రజిత గజవాహనంపై బంగారు అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరా యలను అధిష్టించి పీఠాధిపతి మహా మంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం వైశాఖపాడ్యమి శుభ సందర్భాన్ని పురష్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు, డ్రైన్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

ఎమ్మిగనూరు, మే13(ఆంధ్రజ్యోతి): కలుగొట్ల రోడ్డులో నిర్మిస్తున్న రోడ్డు, డ్రైన్ల నిర్మాణపనుల్లో నాణ్యాతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కాంట్రాక్టర్‌కు ఆదేశించా రు. మంగళవారం ఆయన కలుగొట్ల రోడ్డులో రూ. 35లక్షలతో ని ర్మిస్తున్న సీసీ రోడ్డు, రూ. 25లక్షలతో నిర్మిస్తున్న డ్రైన్, ఎస్సీ స్మశానవాటిక పక్కన రూ. 25లక్షలో జరుగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నా ణ్యతా ప్రమాణాలతో పాటు పనులు వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈ మదన్ ఉన్నారు

ఘనంగా రామప్ప, లచ్చప్ప రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నందవరం, మే 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో రామప్ప, లచ్చప్ప జాతర రథోత్సవాన్ని భక్తులు వైభవంగాజరుపుకున్నారు. రెండు రోజలుగా జాతరను పురస్కరించుకొని దేవాలయాన్ని ప్రత్యేక రంగులతో అలంకరించారు. స్వామి వారిని ప్రత్యేకంగా వెండి ఆభరణాలతో పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా శోభాయమానంగా అలంకరించారు. ఆకుపూజ, తులసీ పూజ, మహామంగళహరతి నిర్వహించారు. రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది మంది భక్తులు హజరయ్యారు.

పులికనుమ నీటి నిల్వను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్



పులికనుమ రిజర్వాయర్‌ను సందర్శించిన కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : పెద్దకడుబూరు మండలంలోని పులికనుమ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వను ఎమ్మిగనూరు మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి మంగళవారం పరిశీలించారు. వేసవిలో నీటిఎద్దడి కారణంగా గుడికల్ చెరువులోని నీరు తగ్గు ముఖం పట్టడంతో ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు తాగు నీటి ఇబ్బం దులు రాకుండా ముందస్తు జాగ్రతగా పులికనుమ ప్రాజెక్ట్ నుంచి పట్టణానికి రావలసిన వాటాను పరిశీలించి సంబంధిత ఇరిగే షన్ అధికారులతో చర్చించి ఈనెల 23వ తేదిలోపు పట్టణానికి అవస రమైన నీటిని చెరువులో నిల్వ చేసుకొవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మంత్రాలయం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుదేవకుంట సమీపంలో మోటారు సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ ప్రమాదం సోమవారం రాత్రి జరిగింది. కదిరికోట రాజేష్ అనే వ్యక్తి ఎమ్మిగనూరు నుంచి సూగూరుకు మోటారు సైకిల్‌పై వస్తుండగా.. వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు ,కాళ్లకు గాయాలయ్యాయి. చికిత్స నిమ్మితం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో మంత్రాల యం హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మూడు రోజుల పాటు వర్షం

ఎమ్మిగనూరురూరల్ , మే13 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు జిల్లాలో ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. 14, 15, 16వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు పడే అవకాశం ఉందన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, మెరుపులు, ఉరుముల సమయంలో చెట్లకిందకు వెళ్లకూడదని తెలిపారు.

రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యాభరద్వాజ్



సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

ఎమ్మిగనూరు రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): రీ సర్వేను పకడ్బందీగా చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కోటేకల్లు గ్రామంలో జరిగే రీ సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయంలో అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు భూమి కొలతల్లోని సమస్యలను రీ సర్వేలోనే పూర్తిచేసేలా చూడాలన్నారు. రైతులకు రీసర్వేపై సమాచారాన్ని అందించి పనులు చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శేషఫణి, రీ సర్వే డీటీ జ్యోతీర్మయి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ఎమ్మిగనూరు రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని గుడికల్లు గ్రామ సమీపంలోని శ్రీరామ్‌నగర్‌లో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మాదు గుండు రామన్న(65) రోడ్డుదాటుతుండగా మాస్‌మాన్‌దొడ్డి నుంచి వస్తున్న మోటారు సైకిల్ ఢీకొట్టింది. దీంతో తీవ్రమైన గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎద్దుల బండ్ల గిరక లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న నరవ రమాకాంతరెడ్డి

పెద్దకడుబూరు , మే14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నకడుబూరులో తాలుకాస్థాయి ఎద్దుల బండ్ల గిరక లాగుడు పోటీ లు అట్టహాసంగా సాగాయి. గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి జాతర సందర్భంగా తాలుకాస్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను రాష్ట్ర రైతు సంఘం టీడీపీ కార్యదర్శి నరవ రమాకాంతరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో హనుమాపురం గ్రామానికి చెందిన గోవిందప్ప వృషభాలు మొదటి బహుమతి రూ.15వేలను, లక్ష్మారి మరియగౌడు వృషబాలు రూ.10వేలు, కంబళదిన్నె గజ్జాల ఉసేని ఎద్దులు రూ.8వేలు, హెచ్. మురవణి వెంకటేష్ వృషభాలు రూ.5వేలను కైవసం చేసుకున్నాయి. మల్లికార్జున, మీసేవా ఆంజ నేయులు, ఎంజీ నరసన్న, లక్ష్మన్న, బుషిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా జూన్ 12న మూడు లక్షల గృహ ప్రవేశాలకు సన్నంద్ధం

గోనెగండ్ల, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూన్ 12వ తేదిన రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల గృహప్రవేశాల కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా హౌసింగ్ పీడీ చిరంజీవి తెలి పారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎంపీడీవో సమావేశ భవనం నందు సచివాలయ ఉద్యోగులతో ఇంటి నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో మండలం లోని ఏ గ్రామానికి ఎన్ని గృహాలు మంజూరు అయ్యాయి. అందులో ఎన్ని పూర్తయ్యాయని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని ఆయన సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే మండలంలో 139 మంది లబ్ధిదారులకు అదనపు బిల్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో, ఎంపీడీవో మణిమంజరి, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంపీడీవో మణింజరి, హౌసింగ్ ఏఈ షేక్షావలి, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : కార్మిక ఉద్యోగ ఉద్యోగ వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుకై మే20న దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కార్మిక సంఘాలకు సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఆర్‌టిసిబస్ డిపో ఎదుట కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ మే 14వ తేదిన ఎమ్మిగనూరు ఎన్జీఒస్ భవన్ నందు రౌండ్ టేబుల్ సమావేశంను ఏర్పాటు చేసి వాటిపై కులకుంశంగా చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మగురుడు,అనీఫ్,వెంకటేశ్వర శెట్టి తదితరులు పాల్గొన్నారు.